Truth of News

RNI NO : APTEL/25/A0239

సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS

irspublications12@gmail.com

సంపుటి: 01 | అన్నమయ్య జిల్లా | సంచిక : 292 | శనివారం 09 మే 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

క్షమాపణ చెప్పడానికి ఇంత జాప్యమా ?

- కల్నల్ సోఫియా ఖురేషిపై
- మంత్రి వ్యాఖ్యల కేసులో సుప్రీం ఆగ్రహం

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

ఆపరేషన్ సిందూర్ వివరాలను మీడియాకు వెల్లడించిన కల్నల్ సోఫియా ఖురేషిపై అవమానకరమైన వ్యాఖ్యలు చేసి వార్తల్లోకెక్కిన మధ్యప్రదేశ్ మంత్రి విజయ్ షా తన వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పడానికి కూడా చాలా జాప్యం చేశారని సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. "ఒక రాజకీయ నేత

- మిగతా 2లో..

- కొత్త ప్రభుత్వ ఏర్పాటులో తొలగని అనిశ్చితి.. అనేక నాటకీయ పరిణామాలు
- గవర్నర్ రాజేంద్ర అర్లీకర్‌తో టీవీకే చీఫ్ విజయ్ సమావేశం..
- 120 మంది సభ్యుల సంఖ్యా బలాన్ని చూపెట్టిన దళపతి
- మద్దతు పలికిన వామపక్షాలు..
- ప్రభుత్వ ఏర్పాటుపై గవర్నర్ కార్యాలయం నుంచి వెలువడని అధికారిక ప్రకటన..
- మద్దతు లేఖ ఇచ్చిన వీసీకే.. ధృవీకరించని లోక్‌భవన్
- టీవీకేకు హ్యాండిచ్చిన ఐయూఎంఎల్..
- రాజకీయ వర్గాల్లో కొనసాగుతున్న ఉత్కంఠ
- ఇండియా కూటమికి గుడ్‌బై.. డీఎంకే సంచలన నిర్ణయం

తమిళనాడులో వీడని సస్పెన్స్!

చెన్నై - సూర్య వాస్తవం

తమిళనాడులో కొత్త ప్రభుత్వ ఏర్పాటుపై సస్పెన్స్ వీడటం లేదు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో అతిపెద్ద పార్టీగా అవతరించిన విజయ్ నేతృత్వంలోని టీవీకే ప్రభుత్వ ఏర్పాటుకు చేస్తున్న ప్రయత్నాలకు అనేక రూపాల్లో అడ్డంకులు ఏర్పడుతున్నాయి. ప్రభుత్వ ఏర్పాటుకు తమను ఆహ్వానించాలంటూ ఇప్పటికే రెండు సార్లు గవర్నర్‌ను కలిసిన విజయ్‌కు.. లోక్‌భవన్ నుంచి గ్రీన్ సిగ్నల్ లభించలేదు. ఇక శుక్రవారం సాయంత్రం టీవీకే అధినేత మూడోసారి గవర్నర్‌ను కలిశారు. తమకు 120 మంది సభ్యుల బలం ఉందని గవర్నర్‌కు విజయ్ వివరించినట్టు సమాచారం. దీంతో ప్రభుత్వ ఏర్పాటుకు గవర్నర్.. విజయ్‌ని ఆహ్వానించారని వార్తలు వచ్చాయి. అలాగే సీఎంగా విజయ్ శనివారం ఉదయం 11 గంటలకు ప్రమాణస్వీకారం చేస్తారని కూడా విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. అయితే కొత్త ప్రభుత్వ ఏర్పాటు విషయంలో గవర్నర్ కార్యాలయం నుంచి మాత్రం ఎలాంటి ప్రకటనా వెలువడకపోవడంతో పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చినట్టయ్యింది. ?విజయ్ టీవీకేకు అప్పటి వరకు మద్దతు ప్రకటించిన వీసీకే, ఐయూఎంఎల్‌ల తీరుతో ఈ ప్రతిష్టంభన నెలకొంది. వీసీకే అధికారికంగా మద్దతు లేఖను అందించలేదు. మధ్యాహ్నం వరకు.. టీవీకేకు మద్దతు ఇస్తామని ప్రకటించిన ఐయూఎంఎల్ సాయంత్రం వరకు తన మద్దతును ఉపసంహరించుకుంది. ఈ మేరకు ఐయూఎంఎల్

- మిగతా 2లో..

ఉపాధి హామీ పునరుద్ధరణకు సుప్రీంకోర్టును ఆశ్రయించాలి

- ముఖ్యమంత్రి సిద్ధరామయ్య నేతృత్వంలో మంత్రివర్గ సమావేశం

బెంగళూరు - సూర్య వాస్తవం

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (వీబీ=జు-ూా)ను రద్దు చేసిన 'అభివృద్ధి చెందిన భారత్-ఉపాధి మరియు జీవనోపాధి హామీ మిషన్ ((గ్రామీణ్)' చట్టానికి వ్యతిరేకంగా సుప్రీంకోర్టును ఆశ్రయించాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. ఎంఎన్ఆర్ఈజీ

- మిగతా 2లో..

అవసరమైన వారందరికీ ఇళ్లు.. ఇళ్లస్థలాలు

- ప్రభుత్వస్థలాల్లో నిర్మాణాలను క్రమబద్ధీకరించాలి
- ఆగస్టు 15లోగా 2.50 లక్షల ఇళ్లలో గృహ ప్రవేశాలు
- కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు

అమరావతి - సూర్య వాస్తవం

అవసరమైన వారందరికి ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. కలెక్టర్ల సమావేశం చివరిరోజైన శుక్రవారం ఆయన సంక్షేమ, రెవెన్యూ, గృహ, వేసవి కార్యాచరణ వంటి అంశాలపై ఉన్నతాధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి క్రమబద్ధీకరించే అంశంపై కూడా

- మిగతా 2లో..

బెంగాల్ తొలి బీజేపీ సీఎంగా సువేందు అధికారి..

- పశ్చిమ బెంగాల్ బీజేపీ శాసనసభాపక్ష నేతగా సువేందు అధికారి ఎన్నిక
- కోల్‌కతాలో అధికారికంగా ప్రకటించిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా
- భవానీపూర్‌లో మమతా బెనర్జీపై గెలిచిన సువేందుకే సీఎం పీఠం
- నేడు కోల్‌కతాలోని బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌లో ప్రమాణస్వీకారం

2లో

- ప్రధాని మోదీ హాజరుకానున్నట్లు సమాచారం

13న పుదుచ్చేరి సీఎంగా రంగసామి ప్రమాణం

- లెఫ్టినెంట్ గవర్నర్ కే.కైలాసనాథ్‌ను కలిసిన ఎన్డీయే కూటమి పార్టీలు
- తనకు మద్దతుగా ఉన్న ఎమ్మెల్యేల జాబితాను అందజేసిన రంగసామి
- అసెంబ్లీ ఎన్నికల్లో 18 స్థానాలు గెలుచుకున్న ఎన్డీయే కూటమి

2లో

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

బ్లూకాలర్ జాబ్స్‌కే డిమాండ్

హైదరాబాద్ - సూర్య వాస్తవం

ప్రపంచవ్యాప్తంగా బ్లూ కలర్ జాబ్స్ కు డిమాండ్ పెరుగుతున్నదని సీఎం ఏ రేవంత్‌రెడ్డి చెప్పారు. గతంలో వైట్ కాలర్ ఉద్యోగాల కోసం పోటీ ఉండేదనీ, ఇప్పుడు విదేశీ ఉద్యోగావకాశాలు పుష్కలంగా ఉన్నాయని తెలిపారు. అమెరికా కంటే జర్మనీ, జపాన్ దేశాల్లో ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా అందుబాటులో ఉన్నాయన్నారు. దాని కోసమే రాష్ట్రంలో ఉన్న ఐటీఐ కేంద్రాలను అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్లు (ఏటీసీ)గా అభివృద్ధి చేశామన్నారు. శుక్రవారం నాంపల్లిలోని హజ్ హౌస్ నుంచి బయల్దేరుతున్న హజ్ యాత్రికుల బస్సులను ఆయన జెండా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ఏడాది హజ్ యాత్రకు వెళ్లి బస్సు ప్రమాదంలో 44 మంది మృతి చెందారనీ, అలాంటి ఘటనలు హృదయాలను కలచివేస్తాయని

- విదేశీ ఉద్యోగావకాశాలు పెరుగుతున్నాయి
- అందుకే ఐటీఐలను ఏటీసీలుగా అప్‌గ్రేడ్..
- ఆటోలకు ఉచితంగా ఈవీలుగా మార్పు
- సర్ పేరుతో ఓట్లు తొలగిస్తే చూస్తూ ఊరుకోం
- హజ్ యాత్రికులకు కేంద్రం పెంచిన చార్జీలను రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుంది
- హజ్ యాత్రికుల బస్సులను జెండా ఊపి ప్రారంభించిన సీఎం రేవంత్‌రెడ్డి

ఆవేదన వ్యక్తంచేశారు. ఆ ప్రమాదంలో మరణించిన ఒక్కో మృతుడి కుటుంబానికి ప్రభుత్వం రూ.5 లక్షల పరిహారం ఇచ్చి ఆదుకున్నదని చెప్పారు. సంక్షేమంలో మైనారిటీల వాటాను వారికి అందిస్తున్నామని

- మిగతా 2లో..

మురిగిపోతున్న కేంద్ర నిధులు

- రెండేళ్లలో ఖర్చు చేయనవి రూ.10,700 కోట్లు
- వంద శాతం ఖర్చు చేయాలి : సిఎం చంద్రబాబు

అమరావతి - సూర్య వాస్తవం

కేంద్రం నుంచి వచ్చే నిధులపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కలెక్టర్లతో సమీక్షించారు. కేంద్రం నుంచి వస్తున్న నిధులు ఎక్కువ శాతం మురిగిపోతున్నట్లు గుర్తించారు. ప్రతియేటా రూ.ఐదు వేలకోట్ల వరకు ఇలా మురిగిపో తున్నట్లు అధికారులు తమ నివేదికలో పేర్కొనడం గమనార్హం. ఇకపై అలా జరగకూడదని, వచ్చిన నిధులను వంద శాతం ఖర్చు చేసేలా చూడాలని సిఎం చంద్రబాబు ఆదేశించారు. తాజా గణాంకాల మేరకు రెండేళ్లలో రూ.10,731 కోట్లు మురిగిపోయాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.5,400 కోట్లు,

- మిగతా 2లో..

Truth of News
సూర్య వాస్తవం
http://www.suryavastavam.in

క్షమాపణ చెప్పడానికి
ఇంత జాప్యమా ?

(మొదటిపేజీ తరువాయి)

పొగడాలనుకున్నపుడు ఎంత బాగా చేయగలరో మనకు తెలుసు, ఒకవేళ ఆయన క్షమాపణ చెప్పాలనుకుంటే అది వెంటనే చెప్పి వుండాల్సింది" అని చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ వ్యాఖ్యానించారు. ఇది అత్యంత దురదృష్టకరమైన సంఘటన అని ఆయన వ్యాఖ్యానించారు. దానిపై విజయ్ షా తరపు సీనియర్ న్యాయవాది మమిందర్ సింగ్ మాట్లాడుతూ, ఆ మరుసటి రోజే టివిలో షా బహిరంగంగా క్షమాపణ చెప్పారని తెలిపారు. దానిపై చీఫ్ జస్టిస్ స్పందిస్తూ ఈ విషయాన్ని కోర్టు తనకు తానుగా పరిగణనలోకి తీసుకున్న తర్వాతనే ఆ క్షమాపణ కూడా వెలువడిందన్నారు. పైగా ఆ క్షమాపణ కూడా 'బూటకపు సమర్థన' లో భాగంగా వున్నట్లు కనిపించిందన్నారు. "మీరు చేతులు జోడించి క్షమాపణ చెప్పాలి. ... కానీ మీరు చట్టానికి అతీతులన్నట్లుగా భావిస్తున్నారు.' అని జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. కల్నల్ సోఫియా ఖురేషిని ప్రశంసించాలన్నదే తన క్లయింట్ ఉద్దేశ్యమని, కానీ దాన్ని సరిగా వ్యక్తీకరించలేకపోయారని తెలిపారు. మధ్యప్రదేశ్ ప్రభుత్వం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు.

బ్లూకాలర్ జాబ్స్‌కే డిమాండ్

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. ఉద్యోగాలు, సంక్షేమ పథకాల్లో మైనార్టీల వాటాలు వారికే వందశాతం అందచేస్తున్నామన్నారు. విదేశీ విద్య విషయంలోనూ మైనారిటీలకు స్కాలర్‌షిప్‌లు అందిస్తున్నామన్నారు. హైదరాబాద్ లో చాలామంది మైనారిటీలు ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారనీ, ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) లోపల ఉన్న అన్ని ఆటోలకు ఉచితంగా రెట్రో ఫిట్టింగ్ చేసి ఎలక్ట్రికల్ వెహికల్ ఆటోగా మార్చాలని నిర్ణయించామన్నారు. దీనివల్ల ఆటో డ్రైవర్లకు డబ్బులు ఆదా అవుతాయని చెప్పారు. 'సర్' పేరుతో తెలంగాణలో ఓట్లు తొలగించాలని చూస్తున్నారనీ, ఇతర రాష్ట్రాల్లో జరిగినట్టు మన రాష్ట్రంలో జరగనివ్వద్దని అన్నారు. దీనికోసం అందరం కలిసికట్టుగా పనిచేయాలని చెప్పారు. ఇరాన్, ఇరాక్ యుద్ధంతో విమాన ఇంధన ఛార్జీలు పెరిగాయనీ, ఆ మేరకు కేంద్ర ప్రభుత్వం హజ్ యాత్రీకుల ప్రయాణంపై అదనపు ఆర్థిక భారాలు మోపిందని గుర్తుచేశారు. అయితే ఆ భారాలు వారిపై పడకుండా రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని నిర్ణయించిందన్నారు. తమకు హిందూ ముస్లిం భేదాభిప్రాయం లేదనీ, ప్రజా సంక్ష?మంలో అందర్నీ సమానంగానే చూస్తామన్నారు. తమ నినాదం 'హిందూ ముస్లిం భాయీ భాయీ ' అనేనని స్పష్టం చేశారు. అభివృద్ధిలో తెలంగాణను దేశంలోనే అగ్రస్థానంలో నిలపాలనీ, దానికి ప్రజలంతా కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మైనార్టీ సంక్ష?మ శాఖ మంత్రి మహ్మద్ అజారుద్దీన్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ, ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్, ఎమ్మెల్సీ మీర్జా రియాజ్, టీజీఎమ్ఆర్ఈఐఎస్ అధ్యక్ష?లు ఫహీముద్దీన్ ఖురేషి, హజ్ కమిటీ చైర్మె గులామ్ అఫ్జల్ బియాబని, వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లా హుస్సేనీ, టీజీఎమ్ఎఫ్‌సీ చైర్మెన్ ఒబేదుల్లా కొత్వాల్, ఉర్దూ అకాడమీ ప్రెసిడెంట్ తాహెర్ బిల్ హమద్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పునరుద్ధరణకు
సుప్రీంకోర్టును ఆశ్రయించాలి

(మొదటిపేజీ తరువాయి)

స్థానంలో వీబీజీ రామ్‌జీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేయడాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే వ్యతిరేకించి, వీబీ=జు+రామ్‌జీ పునరుద్ధరించాలని డిమాండ్ చేసింది. కేబినెట్ సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడుతూ, న్యాయ, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి హెచ్.కె. పాటిల్, "కొత్త పథకం అమలుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఇంకా ఎలాంటి నోటిఫికేషన్ గానీ, స్పష్టమైన మార్గదర్శకాలు గానీ జారీ చేయలేదు. అందువల్ల, ప్రజల ప్రయోజనాల దృష్ట్యా సుప్రీంకోర్టును ఆశ్రయించాల్సిన అవసరం ఏర్పడింది" అని అన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసి, ఎంజీఎన్ఆర్ఈజీఏ అమలుకు అనుమతించాలని కోర్టును అభ్యర్థించనున్నామని ఆయన అన్నారు. ఎంజీఎన్ఆర్ఈజీఏను పునరుద్ధరించాలని కూడా తాము డిమాండ్ చేస్తామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర రాజ్యాంగ హక్కులను హరించిందని, దీనివల్ల వ్యవసాయ కార్మికులపై ప్రతికూల ప్రభావం పడిందని ఆయన ఆరోపించారు.

బెంగాల్ తొలి బీజేపీ సీఎంగా
సువేందు అధికారి..

- పశ్చిమ బెంగాల్ బీజేపీ శాసనసభాపక్ష నేతగా సువేందు అధికారి ఎన్నిక
- కోల్‌కతాలో అధికారికంగా ప్రకటించిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా
- భవానీపూర్‌లో మమతా బెనర్జీపై గెలిచిన సువేందుకే సీఎం పీఠం
- నేడు కోల్‌కతాలోని బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌లో ప్రమాణస్వీకారం
- ప్రధాని మోదీ హాజరుకానున్నట్లు సమాచారం

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో కొత్త శకం ప్రారంభమైంది. రాష్ట్ర బీజేపీ శాసనసభాపక్ష నేతగా సువేందు అధికారి ఎన్నికయ్యారు. కోల్‌కతాలో శుక్రవారం జరిగిన బీజేపీ నూతన ఎమ్మెల్యేల సమావేశంలో ఈ మేరకు ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్నారు. ఈ కార్యక్రమానికి కేంద్ర పరిశీలకుడిగా హాజరైన కేంద్ర హోంమంత్రి అమిత్ షా... బెంగాల్ బీజేపీ శాసనసభాపక్ష నేతగా సువేందు అధికారి పేరును అధికారికంగా ప్రకటించారు. ఈ క్రమంలో బెంగాల్ తొలి బీజేపీ ముఖ్యమంత్రిగా సువేందు రేపు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ చారిత్రాత్మక విజయం సాధించి, 15 ఏళ్ల తృణమూల్ కాంగ్రెస్ పాలనకు తెరదించిన విషయం తెలిసిందే. మొత్తం 294 స్థానాలకు గాను 207 సీట్లు గెలుచుకొని బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతోంది. ఈ నేపథ్యంలో శాసనసభాపక్ష నేత ఎన్నిక కోసం కోల్‌కతాలోని బిశ్వ బంగ్లా కన్వెన్షన్ సెంటర్‌లో ఎమ్మెల్యేలు సమావేశమయ్యారు. ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ సహ పరిశీలకునిగా వ్యవహరించారు. ఈ ఎన్నికల్లో సువేందు అధికారి నందిగ్రామ్‌తో పాటు భవానీపూర్ స్థానం నుంచి కూడా గెలుపొందారు. ముఖ్యంగా భవానీపూర్‌లో తృణమూల్ అధినేత్రి మమతా బెనర్జీపై 15 వేలకు పైగా ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించడం ఆయనకు కలిసొచ్చింది. మే 9న కోల్‌కతాలోని ప్రసిద్ధ బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌లో సువేందు అధికారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ హాజరయ్యే అవకాశం ఉంది. సువేందు అధికారి ఎన్నికతో రాష్ట్రంలో బీజేపీ నేతలు, కార్యకర్తలు సంబరాలు చేసుకుంటున్నారు.

తమిళనాడులో వీడని సస్పెన్స్!

(మొదటిపేజీ తరువాయి)

ఒక ప్రకటనను సైతం విడుదల చేసింది. ఫలితగా టీవీకే బలం 116కు పడిపోయినట్టయ్యింది. అయితే ఈ కారణంగానే గవర్నర్ కార్యాలయం నుంచి అధికారిక ప్రకటన వెలువడలేదని తెలుస్తోంది. దీంతో తమిళ రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి.

టీవీకేకు మద్దతు లేఖ మెయిల్ చేసిన వీసీకే

అనిశ్చిత రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో వీసీకే.. టీవీకేకు ఈమెయిల్ ద్వారా మద్దతు లేఖను పంపింది. ఈ విషయాన్ని వీసీకే ట్వీట్ ద్వారా తెలియజేసింది. కాగా వీసీకే, ఐయూఎంఎల్‌లకు ఇద్దరు చొప్పున ఎమ్మెల్యేలు ఉన్నారు.

విజయ్ ప్రమాణస్వీకారంపై అనిశ్చితి

శుక్రవారం సాయంత్రం మారిన పరిస్థితుల నడుమ సీఎంగా విజయ్ ప్రమాణస్వీకారంపై మేఘాలు కమ్ముకున్నాయి. శనివారం ఉదయం 11 గంటలకు విజయ్ ప్రమాణస్వీకారం చేస్తారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. అయితే ఇప్పటికీ విజయ్ టీవీకే పార్టీ మెజారిటీ మార్కుకు రెండు స్థానాల దూరంలో ఉండటంతో ప్రభుత్వ ఏర్పాటుకు ఆటంకం ఏర్పడిందని రాజకీయ పరిశీలకులు వివరిస్తున్నారు.

ఫలితాలు వెలువడినప్పటి నుంచి రాజకీయ అనిశ్చితి

ఈనెల 4న అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడినప్పటి నుంచి తమిళనాడులో రాజకీయ అనిశ్చితి కొనసాగుతోంది. మొత్తం 234 స్థానాలు కలిగి ఉన్న తమిళనాడు అసెంబ్లీలో ప్రభుత్వ ఏర్పాటు కోసం మ్యాజిక్ ఫిగర్ 118 స్థానాలను దక్కించుకోవాలి. అయితే ఫలితాల్లో ఏ ఒక్క పార్టీ కూడా మ్యాజిక్ ఫిగర్‌ను అందుకోలేక పోయింది. విజయ్ టీవీకే 108 స్థానాలు గెలిచి అతిపెద్ద పార్టీగా అవతరించి.. మ్యాజిక్ ఫిగర్‌కు 10 స్థానాల దూరంలో ఆగిపోయింది. డీఎంకే 59, ఏఐఏడీఎంకే 47 స్థానాలకు పరిమితమయ్యాయి. ఇక కాంగ్రెస్ ఐదు స్థానాలు, పీఎంకే నాలుగు, సీపీఐ(ఎం), సీపీఐ, ఐయూఎంఎల్, వీసీకే లు రెండు స్థానాల చొప్పున, బీజేపీ, డీఎండీకే, అమ్మ మక్కల్ మున్నేట్ర కజగంలు ఒక్క సీటు చొప్పున గెలుచుకున్నాయి.

గవర్నర్‌ను ఇప్పటికే రెండు సార్లు కలిసిన విజయ్

ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో అతిపెద్ద పార్టీగా ఉన్న టీవీకే కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని అంతా భావించారు. కానీ ఇందుకు లోక్‌భవన్ బ్రేకులు వేసింది. ప్రభుత్వ ఏర్పాటుకు తమకు అవకాశమివ్వాలంటూ టీవీకే అధినేత విజయ్ ఇప్పటికే బుధ, గురు వారాల్లో రెండు సార్లు తమిళనాడు గవర్నర్ రాజేంద్ర అర్లేకర్‌ను కలిశారు. కానీ స్పష్టమైన మెజారిటీ 118 స్థానాలు లేవనే కారణంతో గవర్నర్ రెండు సార్లు కూడా విజయ్ ప్రతిపాదనను తిరస్కరించారు.

డీఎంకే-అన్నాడీఎంకే కూటమి ప్రభుత్వంపై ఊహాగానాలు

ఒకానొక సమయంలో తమిళనాడులో బద్ధ శత్రువులైన డీఎంకే, అన్నాడీఎంకేలు కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశాలున్నాయని కూడా వార్తలు వచ్చాయి. బీజేపీని దూరం పెడితే తాము బయటి నుంచి అన్నాడీఎంకేకు మద్దతు తెలుపుతామని కొందరు డీఎంకే నేతలు కూడా ప్రతిపాదించినట్టు కథనాలు వెలువడ్డాయి. ఈ కూటమి ఏర్పాటుపై అంతర్గతంగా చర్చలు జరుగుతున్నట్టు కూడా వార్తలు గుప్పుమన్నాయి. అయితే ఈ వార్తలను డీఎంకే తోసిపుచ్చింది.

విజయ్‌కి మద్దతు తెలుపుతున్న పార్టీలు

విజయ్ టీవీకేకు కాంగ్రెస్, సీపీఐ(ఎం), సీపీఐ, వీసీకేకు మద్దతు తెలిపాయి. మొదటగా మద్దతు తెలిపిన పార్టీ కాంగ్రెస్. ఐదుగురు ఎమ్మెల్యేలున్న కాంగ్రెస్ పార్టీ టీవీకేకు మద్దతు తెలపడంతో బలం 113కు చేరింది. తాజాగా మిగిలిన పార్టీలు కూడా సపోర్ట్ ఇవ్వడంతో అది మ్యాజిక్ ఫిగర్‌ను చేరినట్టయ్యింది. డీఎంకేతో పొత్తుతో అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన కాంగ్రెస్ పార్టీ.. ఇప్పుడు టీవీకే పార్టీకి మద్దతు ఇస్తోంది. కాగా కొత్తగా ఏర్పడనున్న విజయ్ నేతృత్వంలోని ప్రభుత్వంలో మద్దతు ఇస్తున్న పార్టీలకు కూడా క్యాబినెట్ బెర్త్‌లు దక్కనున్నట్టు తెలుస్తోంది. ఇందులో వామపక్షాలకు రెండు, వీసీకేకు ఒక స్థానం దక్కనున్నట్టు వార్తలు వస్తున్నాయి.

బయటనుంచే మద్దతు : వామపక్షాలు

చెన్నైలో సంయుక్త పత్రికా సమావేశంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి పి.షణ్ముగం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఎం.వీరపాండ్యన్ మాట్లాడుతూ... టీవీకేకు మద్దతునివ్వాలని నిర్ణయించినట్టు ప్రకటించారు. టీవీకే మంత్రివర్గంలో తాము చేరబోవడం లేదని తెలిపారు. బయటనుంచే తమ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. సంక్ష?భ నివారణకు, గవర్నర్‌ను అడ్డుపెట్టుకొని బీజేపీ ఆడుతున్న నాటకానికి తెరదించడానికే తాము ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. మతోన్మాద శక్తులను వ్యతిరేకిస్తూ, తమిళనాడు హక్కులను పరిరక్షిస్తూ సాగించే పోరాటాల్లో డీఎంకేతో కలిసి తాము ముందుకు సాగుతామని అన్నారు.

కృతజ్ఞతలు తెలిపిన విజయ్

వామపక్షాలు మద్దతు ప్రకటించిన వెంటనే విజయ్ సీపీఐ(ఎం), సీపీఐ కార్యాలయాలకు వెళ్లి ఆయా పార్టీల నేతలకు కృతజ్ఞతలు తెలియజేశారు. సవాళ్లతో కూడిన ఇటువంటి పరిస్థితుల్లో మద్దతు తెలియజేసినందుకు చాలా కృతజ్ఞుడిని అంటూ విజయ్ తెలిపారని సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు కె.బాలకృష్ణన్ చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మతోన్మాద శక్తులను అనుమతించేది లేదని ఆయన స్పష్టం చేశారన్నారు. తమిళనాడులో సుస్థిరమైన, లౌకిక, ప్రజాస్వామ్య ప్రభుత్వ ఏర్పాటు కోసమే టీవీకేకు మద్దతునిచ్చామని సీపీఐ తెలియజేసింది.

గవర్నర్ తీరుపై విమర్శలు

తమిళనాడు రాజకీయాల్లో నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో అతిపెద్ద పార్టీగా నిలిచిన టీవీకేను ప్రభుత్వ ఏర్పాటుకు గవర్నర్ రాజేంద్ర అర్లేకర్ ఆహ్వానించకపోవడం రాజకీయంగా తీవ్ర చర్చకు దారి తీసింది. కేంద్రం.. గవర్నర్ పదవిని అడ్డం పెట్టుకొని మరోసారి అనైతిక రాజకీయాలకు తెర లేపిందనే విమర్శలను పలువురు రాజకీయ నాయకులు విమర్శించారు. విజయ్‌ని ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని డిమాండ్ చేశారు.

గవర్నర్ తీరు రాజ్యాంగ విరుద్ధం
ఆయన తీరును వ్యతిరేకిస్తున్నాం
విజయ్‌ని ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలి : సీపీఐ(ఎం) విజ్ఞప్తి

తమిళనాడులో రాజకీయ అనిశ్చితి కొనసాగుతున్న తరుణంలో రాష్ట్ర గవర్నర్ రాజేంద్ర అర్లేకర్ తీరుపై సీపీఐ(ఎం) తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసింది. విజయ్‌ను ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించకుండా జాప్యం చేస్తున్న తీరును విమర్శించింది. ఎలాంటి జాప్యం లేకుండా టీవీకే నేత విజయ్‌ను ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని తమిళనాడు గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్‌ను సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి కోరారు. అసెంబ్లీలో అతిపెద్ద పార్టీగా అవతరించిన ఏకైక పార్టీ అయిన టీవీకేను.. మెజారిటీ నిరూపించుకోవడానికి ఆహ్వానించడంలో గవర్నర్ జాప్యం చేయడం సమర్థనీయం కాదనీ, రాజ్యాంగ విరుద్ధమని అన్నారు. రాజ్యాంగ సాంప్రదాయం ప్రకారం అతిపెద్ద పార్టీ నాయకుడితో ప్రమాణస్వీకారం చేయించి, ఆ తర్వాత సభలో మెజారిటీ నిరూపించుకోవడానికి తగిన సమయం ఇవ్వాలని చెప్పారు. 1996లో వాజ్‌పేయికి 13 రోజుల సమయం ఇచ్చారనీ, చివరికి ఆయన ప్రభుత్వం కూలిపోయిందని ఆయన గుర్తు చేశారు. గవర్నర్ తీరును తాము పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్టు చెప్పారు.

అవసరమైన వారందరికీ
ఇళ్లు.. ఇళ్లస్థలాలు

(మొదటిపేజీ తరువాయి)

దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ఆగస్టు 15లోగా 2.50 లక్షల ఇళ్లలో సామూహిక గృహ ప్రవేశాలు జరగాలన్నారు. డిసెంబర్ నాటికి మరో 2.38 లక్షల గృహ ప్రవేశాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. 2027 డిసెంబర్ నాటికి మరో 10 లక్షల ఇళ్ల నిర్మాణం లక్ష్యమన్నారు. 3 సెంట్లు గ్రామాల్లో, 2 సెంట్లు అర్బన్ ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలు ఇవ్వాల్సి ఉందని, లబ్దిదారులు అంగీకరిస్తే ప్రస్తుతం ఉన్న వారికి అదే లే అవుట్లలో ఇళ్ల స్థలాలు ఇవ్వండని చెప్పారు. ఇబ్బందులు లేని చోట భూసేకరణ, సమీకరణతో ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఆదేశించారు. ప్రభుత్వ భూములు, కొండ ప్రాంతాల్లో నిర్మించుకున్న ఇళ్లను క్రమబద్ధీకరించాలని, ఏమైనా ఇబ్బందులు వస్తే మంత్రివర్గానికి పంపితే తాము ఆమోదిస్తామన్నారు. క్రమబద్ధీకరణ వల్ల విజయవాడలో 60 వేల మందికి, విశాఖలో 30 వేల మందికి లబ్ధి చేకూరుతుందని చెప్పారు. 2027 చివరి నాటికి రీ-సర్వే పూర్తి చేసి 22ఏ భూముల సమస్యలను పరిష్కరించాలని స్పష్టం చేశారు. గుంటూరులో 22ఎ భూముల సమస్యలు వచ్చే కలెక్టర్ల సదస్సు నాటికి పెండింగ్ ఉండకూడదని ఆదేశించారు. భూవివాదాల్లో అతిపెద్ద లిటిగెంట్ రెవెన్యూ విభాగమేనని చెప్పారు. 4 లక్షలకు పైగా భూవివాదాల కేసులు పెండింగులో ఉన్నాయని, ఖాళీగా ఉన్న డీఆర్ఓలు, ఆర్డీఓల స్థానాలకు త్వరలో పోస్టింగ్స్ ఇస్తామన్నారు.

బుడగ జంగాలను ఎస్సీలో చేర్చే అంశంపై కేంద్రం వద్దకు

బుడగ జంగాలను ఎస్సీల్లో చేర్చాలనే డిమాండ్ ఉందన్న సిఎం దీనిపై కేంద్రంతో మాట్లాడతామని చెప్పారు. కేంద్రం నుంచి అనుమతులు వచ్చేలోపు ఉద్యోగాలు మినహా ఎస్సీలకు వర్తింప చేసే ప్రతి ప్రయోజనాన్ని బుడగజంగాలకు వర్తింప చేయాలని ఆదేశించారు. బిసి కులాల వెనుకబాటుతనంపై ఏర్పాటు చేసిన కమిషన్ నివేదిక ఆధారంగా స్థానిక సంస్థల్లో తగిన రిజర్వేషన్లు కల్పించేందుకు చర్యలు చేపడతామని చెప్పారు. ప్రజలపై ఆర్థిక భారం తగ్గించేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. విద్య, వైద్యం, విద్యుత్ ఖర్చుల నుంచి ప్రజలకు ఊరట కలిగించేలా చొరవ చూపాలని తెలిపారు. పావలా వడ్డీకే జాతీయ, అంతర్జాతీయ సంస్థల్లో చదువుకునేలా విద్యారుణం ఇప్పించేలా కార్యాచరణ చేపట్టాలన్నారు. 11 లక్షల మందికి పైగా కుటుంబాలను పీ4 కింద అడాప్ట్ చేసుకున్నట్లు తెలిపారు.

మైనార్టీలకోసం వక్ఫ్ స్థలాల్లో ఆటోనగర్‌లు

ముస్లిం జనాభా ఉన్న చోట రూరల్ ఆటోనగర్‌లు ఏర్పాటు చేస్తే ఓ పారిశ్రామిక వాడ సిద్ధమవుతుందన్నారు. వక్ఫ్ బోర్డు స్థలాల్లో ఈ పారిశ్రామిక వాడలను మైనారిటీల కోసమే ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని చెప్పారు. జీవనోపాధి హబ్‌లుగా వీటిని అభివృద్ధి చేయాలని తెలిపారు.

13న పుదుచ్చేరి సీఎంగా
రంగసామి ప్రమాణం

అమరావతి -ఆంధ్రనాడు, మే 08

ఏఐఎన్ఆర్‌సీ అధినేత ఎన్.రంగసామి ఈ నెల 13వ తేదీన పుదుచ్చేరి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. రంగసామి ఈరోజు లెఫ్టినెంట్ గవర్నర్ కె. కైలాసనాథ్‌ను కలిసి తనకు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి కావాల్సిన బలం ఉందని తెలిపారు. ఈ మేరకు తనకు మద్దతుగా ఉన్న ఎమ్మెల్యేల జాబితాను అందజేశారు. రంగసామి వెంట కూటమి పార్టీలకు చెందిన కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు ఉన్నారు. రంగసామి సమర్పించిన లేఖను ఆమోదం కోసం రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు పంపించనున్నట్లు లెఫ్టినెంట్ గవర్నర్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. 30 సీట్లున్న పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి 18 స్థానాలను గెలుచుకుంది. ప్రభుత్వ ఏర్పాటుకు కేంద్రమంత్రి మాండవీయ, రంగసామి నేతృత్వంలో మిత్ర పక్ష నాయకులు, ఎమ్మెల్యేలు సమావేశమయ్యారు. ఎన్డీయే కూటమి నాయకుడిగా రంగసామిని ఎన్నుకున్నారు. కూటమిలోని పార్టీలు ఆయనకు మద్దతుగా లేఖలను అందజేశాయి. అనంతరం లెఫ్టినెంట్ గవర్నర్ కైలాసనాథ్‌ను లోక్ నివాస్‌లో కలిసి ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని కూటమి నేతలు కోరారు.

మురిగిపోతున్న కేంద్ర నిధులు

(మొదటిపేజీ తరువాయి)

రూ.5,321 కోట్లు మురిగిపోయాయి. ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.15,126 కోట్లు కేటాయింపులు జరగ్గా, అందులో ఏకంగా 5,321 కోట్లు మురిగిపోవడం గమనార్హం. ఇది మొత్తం కేటాయింపుల్లో ఏకంగా 35 శాతంగా ఉండటం ఆశ్చర్యం కలిగిస్తోంది. ప్రధానంగా పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖలోనే ఏకంగా 47 శాతంతో రూ.2,461 కోట్లు నిధులు మురిగిపోయాయి. అలాగే గృహ నిర్మాణ శాఖ, సాంఘిక సంక్షేమ శాఖ, సెర్ప్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ, పాఠశాల విద్య వంటి శాఖల్లోనే ఎక్కువగా నిధులు మురిగిపోయాయి. ఈ నేపథ్యంలోనే ప్రస్తుత రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని కేంద్ర పథకాల నిధులను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని సిఎం సూచించారు. కేంద్ర నిధుల వినియోగంలో రాజీ పడొద్దని, మొదటి త్రైమాసికం నుంచే పూర్తి స్థాయిలో వాటిని వినియోగించుకోవాలని ఆదేశించారు. సగటున ప్రతి త్రైమాసికానికి రూ.8 వేల కోట్లను అన్ని శాఖలూ ఖర్చు చేయాలని, వీలున్నంత వరకు కేంద్రం నుంచి అదనపు నిధులు సాధించేలా ప్రతిశాఖ చర్యలు చేపట్టాలని నిర్దేశించారు.

నీతీ ఆయోగ్ నిధులపై దృష్టి

పిపిపి వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ కోసం నీతి ఆయోగ్ నిధులు తెచ్చుకునే ప్రయత్నం చేయాలని, పిఎం ఇ-బస్ కింద విద్యుత్ వాహనాలను ప్రవేశపెట్టేలా కార్యాచరణ చేపట్టాలని, ఫాస్ట్ ఛార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయాలని, బస్టేషన్ల ఆధునీకరణ కార్యక్రమం కూడా చేపట్టాలని సూచించారు. అమరావతి, విశాఖపట్నం, తిరుపతిలో ఎలక్ట్రికల్ వెహికల్స్ బస్సులు నడపాలని, విజయవాడ-గుంటూరు-అమరావతి, విశాఖ-అనకాపల్లి-విజయనగరం, తిరుపతి పరిధిలోని ప్రాంతాలను కలుపుతూ ఇవి బస్సులు తిప్పేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అర్బన్ ఛాలెంజ్ మోడ్‌లో వెళ్లాల్సిన ప్రాజెక్టులపైనా ప్రత్యేకంగా దృష్టి పెట్టాలన్నారు.

సంపాదకీయం

విజయ్ కంటే.. రాజేంద్ర అర్లేకరే ఫేమస్

దేశవ్యాప్తంగా కొద్దిరోజులుగా తమిళనాడు రాజకీయాలు సృష్టిస్తున్న సంచలనం మామూలుగా లేదు. ఈ ఎన్నికల్లో తమిళనాడు ప్రజలు ఏ పార్టీకి కూడా వన్ సైడ్ విక్టరీ ఇవ్వలేదు. ప్రభుత్వ వ్యతిరేకతను.. ప్రతిపక్షం పార్టీ మీద ఉన్న ఆగ్రహాన్ని ఏకకాలంలో ప్రదర్శించారు. అభిమానాన్ని కూడా చూపించారు. ఫలితంగా మూడు పార్టీలలో దేనికి కూడా గొప్పగా చెప్పుకునే మెజారిటీ రాలేదు. దీంతో ఈసారి తమిళనాడులో బంపర్ మెజారిటీ ఏ పార్టీ సాధించలేకపోయింది. కనీసం మ్యాజిక్ ఫిగర్ కు దగ్గరగా కూడా రాలేకపోయింది. దీంతో పొత్తులు.. సంకీర్ణాల గురించి చర్చ నడుస్తూనే ఉంది. అయితే ఇంతవరకు తమిళనాడులో ఏర్పడిన సందిగ్ధం తీరలేదు.విజయ్ పార్టీకి అత్యధికంగా స్థానాలు వచ్చినప్పటికీ.. ఆయనకు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే బలం లేదు. ఇతర పార్టీల నేతలను కూడగట్టే ప్రయత్నం చేసినప్పటికీ అది సాధ్యం కావడం లేదు. దీంతో తమిళనాడులో రకరకాల రాజకీయాలు సాగుతూ ఉన్నాయి. ఇప్పటికే డీఎంకే తమిళనాడు రాజకీయాల మీద క్లారిటీ ఇచ్చేసింది. తాము ఎవరికి సపోర్ట్ చేయమని.. ప్రజల ఓటింగ్ ద్వారా లభించిన ప్రతిపక్ష స్థానాన్ని కొనసాగిస్తామని డీఎంకే అధినేత స్టాలిన్ ప్రకటించారు. దీంతో తమిళనాడులో రాజకీయాలు మరో మలుపు తీసుకున్నాయి. ఇప్పటికే రిసార్ట్ నుంచి ఎమ్మెల్యే విజయ్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.విజయ్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు బుధవారం గవర్నర్ ను కలిశారు. కాకపోతే గవర్నర్ అడిగిన ప్రశ్నలకు టీవీకే అధినేత వద్ద సమాధానాలు లేకుండా పోయాయి. దీంతో గురువారం జరగాల్సిన ప్రమాణ స్వీకారం రద్దయింది. అంతేకాదు ఇప్పట్లో తమిళనాడులో ప్రభుత్వం ఏర్పడే అవకాశం కనిపించడం లేదు.తమిళనాడు రాజకీయాల్లో ఈ సందిగ్ధత కొనసాగుతున్న నేపథ్యంలో ఒక వ్యక్తి విజయ్ కంటే ఎక్కువ ప్రాచుర్యం పొందారు. మీడియా కూడా ఆయన గురించి విశేషంగా కథనాలను ప్రసారం చేస్తోంది. ఆ వ్యక్తి రాజకీయాలతో సంబంధం ఉన్నవారు కాదు. పార్టీలతోనూ సంబంధం ఉన్నవారు కాదు. ఆయన మరెవరో కాదు తమిళనాడు గవర్నర్ రాజేంద్ర అర్లేకర్. ఇటీవల విజయ్ గవర్నర్ కార్యాలయం వద్దకు వెళ్ళినప్పుడు రాజేంద్ర సాదరంగా స్వాగతం పలికారు. మెజారిటీ చూపిస్తేనే టీవీకే ప్రభుత్వ ఏర్పాటుకు అనుమతి ఇస్తామని అన్నారు. దీంతో రాజేంద్ర మీద తీవ్రస్థాయిలో చర్చ జరుగుతుంది. కొన్ని పార్టీలు రాజేంద్ర తీరును తీవ్రస్థాయిలో విమర్శిస్తున్నాయి. ఆయన వ్యవహరిస్తున్న తీరు ఏమాత్రం బాగోలేదని మండిపడుతున్నాయి. కమలహాసన్ నుంచి మొదలు పెడితే విశాల్ వరకు అందరు గవర్నర్ తీర్పుల్ల మండిపడుతున్నారు.తమిళనాడు రాజకీయాలలో సస్పెన్స్ వీడటం లేదు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో అతిపెద్ద పార్టీగా అవతరించిన విజయ్ టీవీకే పార్టీకి.. ప్రభుత్వ ఏర్పాటు కోసం గవర్నర్ రాజేంద్ర అర్లేకర్ అనుమతి ఇవ్వకపోవటంపై సర్వత్రా చర్చ జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తమిళనాడు రాజకీయ పరిణామాలపై లోక్‌సత్తా వ్యవస్థాపకులు జయప్రకాష్ నారాయణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. తన అధికారిక ఎక్స్ ఖాతా ద్వారా తాజా రాజకీయ పరిణామాలు, తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. తమిళనాడులో ప్రభుత్వ ఏర్పాటుకు టీవీకే విజయ్‌ను గవర్నర్ అనుమతించకపోవటం అన్యాయమైన చర్యగా జయప్రకాష్ నారాయణ్ పేర్కొన్నారు.గవర్నర్ తీరు అప్రజాస్వామికమే కాకుండా.. రాజ్యాంగ స్ఫూర్తికి, మౌలిక సూత్రాలకు పూర్తిగా విరుద్ధమని విమర్శించారు. ప్రభుత్వానికి శాసనసభ మద్దతు ఉందా, లేదా అనే విషయం తేల్చాల్సింది అసెంబ్లీలో కానీ.. రాజ్‌భవన్‌లో (లోక్ భవన్) కాదని జయప్రకాష్ నారాయణ్ అభిప్రాయపడ్డారు.

ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని.. విజయ్‌ను ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించేలా గవర్నర్‌కు సూచించాలని అన్నారు. బలనిరూపణ ద్వారా శాసనసభలో ప్రభుత్వాన్ని ఓడించేంత వరకూ.. మైనారిటీ ప్రభుత్వమైనా పాలన సాగించవచ్చని జయప్రకాష్ నారాయణ్ పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు గతంలో ఎన్నో జరిగాయన్న జేపీ.. 1969లో కాంగ్రెస్ చీలిక తర్వాత ఇందిరా గాంధీ ప్రభుత్వం ఏర్పాటు, 1991 నుంచి 1996 వరకూ పీవీ నరసింహారావు పాలనను గుర్తు చేశారు.రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండి పక్షపాత రాజకీయాలు చేసే హక్కు గవర్నర్లకు లేదని జయప్రకాష్ నారాయణ్ స్పష్టం చేశారు. తమిళనాడులో ప్రస్తుతమున్న రాజకీయ సంస్కృతిని తిరస్కరిస్తూ తమిళ ప్రజలు అసాధారణమైన తీర్పును ఇచ్చారని.. గవర్నర్ ఆ తీర్పును అగౌరవపరచడం రాజకీయాలపై ప్రజల విశ్వాసాన్ని మరింత దెబ్బతీసి, ప్రజాస్వామ్యాన్ని బలహీనపరుస్తుందని జయప్రకాష్ నారాయణ్ అభిప్రాయపడ్డారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇలాంటి చర్యలు.. వీధి పోరాటాలకు, ప్రభుత్వాల పతనానికి ఎలా దారితీస్తాయో పొరుగు దేశాలలో చూశామని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా వివేకం, ముందుచూపుతో వ్యవహరించి, తమిళనాడులో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అతిపెద్ద పార్టీగా నిలిచినవారిని ఆహ్వానించమని గవర్నర్‌కు సలహా ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అలాగే రాజ్యాంగ విలువల పరిరక్షణకు రాష్ట్రపతి జోక్యం చేసుకోవాలని.. గవర్నర్ ఇంకా మొండిగా వ్యవహరిస్తే, అతడిని తక్షణమే తొలగించాలని సూచించారు.రాజేంద్ర 1989లో బిజెపిలో చేరారు. 2002, 2012లో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2017లో స్పీకర్ గా దేశంలోనే మొట్టమొదటిసారిగా కాగిత రహిత అసెంబ్లీ ని రూపొందించారు. రాజ్యాంగ సూత్రాలను ఈయన నూటికి నూరుపాళ్ళు అమలు చేస్తారు. 2025 నుంచి కేరళ రాష్ట్రానికి గవర్నర్ గా ఉన్నారు. తమిళనాడు రాష్ట్రానికి ఇన్చార్జి గవర్నర్ గా వ్యవహరిస్తున్నారు.

నేల క్షీణత వాతావరణ మార్పు

ముంచుకొస్తున్న ఉపద్రవం

డా.ముచ్చుకోట సురేష్ బాబు



ప్రత్యేక కథనం – సూర్య వాస్తవం

మన కాళ్ళ కింద నిశ్శబ్దంగా ఒక భారీ పర్యావరణ సంక్షోభం పెరుగుతోంది. భూమి "చర్మం"గా పిలువబడే నేల, వాతావరణ మార్పులు, అధిక రసాయన ఆధారిత వ్యవసాయం, అటవీ వినాశనం, భూమి అధిక వినియోగం, అనారోగ్యకరమైన వ్యవసాయ పద్ధతుల కారణంగా వేగంగా క్షీణిస్తోంది. సారవంతమైన భూమికి ప్రాణాధారమైన మట్టిలోని సేంద్రీయ కార్బన్ తగ్గిపోవడం ఆహార భద్రత, జీవవైవిధ్యం, నీటి వ్యవస్థ, ప్రపంచ వాతావరణ స్థిరత్వానికి తీవ్రమైన ముప్పుగా మారిందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. నేల అనేది కేవలం మట్టి కాదు. ఇది జీవంతో నిండిన ఒక సంక్లిష్ట పర్యావరణ వ్యవస్థ. ప్రపంచ ఆహార ఉత్పత్తిలో 95 శాతం కంటే ఎక్కువ భాగం నేలపై ఆధారపడి ఉంటుంది. అంతేకాకుండా భూమిపై ఉన్న జీవ వైవిధ్యం లో దాదాపు మూడింట రెండొంతుల ఇది నివాసంగా ఉంటుంది. ప్రపంచ అంచనాల ప్రకారం, మంచు లేని భూభాగంలో దాదాపు మూడో వంతు ఇప్పటికే మానవ చర్యల వల్ల క్షీణించింది. వాతావరణ మార్పు, జీవ వైవిధ్య నష్టం, నీటి కొరత తో పాటు నేల క్షీణతను కూడా ఒక ప్రధాన ప్రపంచ సంక్షోభంగా పరిగణించాల్సిన అవసరం ఉందని నిపుణులు చెబుతున్నారు.

వాతావరణ మార్పు .

నేల నష్టం : ప్రమాదకర చక్రం

నేల క్షీణత మరియు వాతావరణ మార్పు ఒకదానితో మరొకటి బలంగా అనుసంధానమై ఉన్నాయి. పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, అస్థిర వర్షపాతం, కరువులు, వరదలు, అడవి అగ్నిప్రమాదాలు మట్టిలోని సేంద్రీయ కార్బన్‌ను వేగంగా తగ్గిస్తున్నాయి. అదే సమయంలో క్షీణించిన నేలలో నిల్వ ఉన్న కార్బన్ భారీ స్థాయిలో వాతావరణంలోకి విడుదలై గ్లోబల్ వార్మింగ్‌ను మరింత తీవ్రతరం చేస్తోంది. 1960 నుంచి 2020 మధ్య కాలంలో అడవులు, తడి బయళ్లు, గడ్డి భూములు వ్యవసాయ భూములుగా మార్చడం వల్ల ప్రపంచవ్యాప్తంగా సేంద్రియ కర్బనం స్థాయిలో గణనీయంగా తగ్గాయి. సహజ పర్యావరణ ప్రాంతాలను సాగుభూములుగా మార్చడం వల్ల నేల కార్బన్ 15 నుండి 25 శాతం వరకు తగ్గుతుందని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. మరోవైపు సాగుభూములను తిరిగి అడవులు లేదా గడ్డి భూములుగా మార్చితే కార్బన్ స్థాయిలు 60 శాతం వరకు పెరగవచ్చు. అయితే ఈ పునరుద్ధరణకు దశాబ్దాల సమయం పట్టవచ్చు.

అభివృద్ధి చెందుతున్న దేశాల్లో పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంది. లక్షలాది చిన్న రైతులు అత్యల్ప సేంద్రీయ కార్బన్ ఉన్న భూముల్లో వ్యవసాయం చేస్తున్నారు. అనేక ఉష్ణమండల వ్యవసాయ ప్రాంతాల్లో సేంద్రీయ కార్బన్ స్థాయిలు ఆరోగ్యకర ప్రమాణాల కంటే చాలా తక్కువగా, 0.1 శాతం వరకు పడిపోయాయి. నేల నాశనాన్ని వేగవంతం చేస్తున్న అనారోగ్యకర వ్యవసాయ పద్ధతులు, ఆధునిక వ్యవసాయ పద్ధతులు నేల క్షీణతకు ప్రధాన కారణాలుగా మారుతున్నాయి. అధిక దున్నకం, అసమతుల్య రసాయన ఎరువుల వినియోగం, వరద ఆధారిత సాగు, పంట అవశేషాల దహనం, అధిక మేత వంటి చర్యలు నేల నిర్మాణాన్ని దెబ్బతీసి సారాన్ని తగ్గిస్తున్నాయి. భారీ వ్యవసాయ యంత్రాల వినియోగం వల్ల నేల గట్టిపడటం కూడా ఒక ప్రధాన సమస్యగా మారింది. నేల గట్టిపడినప్పుడు నీటి చొరబాటు తగ్గిపోతుంది, మొక్కల వేర్లు పెరగలేవు, గాలి చలనం తగ్గుతుంది. దీని వల్ల పంట దిగుబడులు పడిపోవడమే కాకుండా మీథేన్, నైట్రస్ ఆక్సైడ్ వంటి హరిత గృహ వాయువుల ఉద్గారాలు పెరుగుతాయి. ప్రత్యేకంగా దక్షిణాసియాలో విస్తృతంగా కనిపించే పంట అవశేషాల దహనం నేల ఆరోగ్యాన్ని మరింత దెబ్బతీస్తోంది. గోధుమ విత్తనాల కోసం పొలాలను త్వరగా సిద్ధం చేయడానికి రైతులు వరి గడ్డిని కాల్చడం సాధారణంగా కనిపిస్తుంది. కానీ ఈ పద్ధతి నేలలోని కార్బన్‌ను తీవ్రంగా తగ్గించి వాయు కాలుష్యం, వాతావరణ మార్పులను పెంచుతోంది.

ఆహార భద్రతకు పెరుగుతున్న ముప్పు

2100 నాటికి ప్రపంచ జనాభా 11 బిలియన్లను దాటనుంది అంచనా. ఈ పరిస్థితిలో నేల నాణ్యత క్షీణించడం ఆహార మరియు పోషక భద్రతకు ప్రత్యేక ముప్పుగా మారుతోంది. క్షీణించిన నేలలు తక్కువ దిగుబడులు మాత్రమే కాకుండా పోషక విలువలు తగ్గిన ఆహారాన్ని ఉత్పత్తి చేస్తున్నాయి. ప్రపంచంలోని మొక్కజొన్న గోధుమ సాగు ప్రాంతాల్లో దాదాపు రెండొంతుల భూముల్లో సేంద్రీయ కార్బన్ స్థాయిలు ప్రమాదకరంగా తగ్గిపోయాయని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. దీని వల్ల ఎరువులు, నీటిపారుదల పై ఆధార పడటం పెరుగుతుండగా వ్యవసాయ వ్యవస్థలు కరువు, తీవ్ర వాతావరణ పరిస్థితులు మరింత సున్నితంగా మారుతున్నాయి. వ్యవసాయం ప్రపంచ హరిత గృహ వాయువుల ఉద్గారాల్లో 30 నుంచి 35 శాతం వరకు వాటా కలిగి ఉండటమే కాకుండా ప్రపంచ తాగునీటి వనరులను 70 శాతం వినియోగిస్తోందన్న విషయం పరిస్థితిని మరింత తీవ్రమైనదిగా మారుస్తోంది.

నేల పునరుద్ధరణ : సహజ వాతావరణ పరిష్కారం

సంక్షోభం తీవ్రంగా ఉన్నప్పటికీ, సరైన పునరుద్ధరణ చర్యల ద్వారా క్షీణించిన నేలలను మళ్లీ ఆరోగ్యవంతంగా మార్చవచ్చని నిపుణులు విశ్వసిస్తున్నారు. పునరుత్పాదక వ్యవ సాయం, సంరక్షణ వ్యవసాయం, సేంద్రియ పదార్థాల వినియోగం, అగ్రో ఫారెస్ట్రీ, మెరుగైన నీటిపారుదల వ్యవస్థల ద్వారా నేలలో సేంద్రీయ కార్బన్‌ను పెంచితే నేల సారం, నీటి నిల్వ సామర్థ్యం, జీవ వైవిధ్యం, పంటల సహనశక్తి గణనీయంగా మెరుగు పడతాయి. ఆరోగ్యకరమైన నేలలు కార్బన్ నిల్వ కేంద్రాలుగా పనిచేస్తాయి. వాతావరణంలో ఉన్న కార్బన్ డయాక్సైడ్‌ను గ్రహించి భూమిలో నిల్వ చేస్తాయి. "కార్బన్ సీక్వెస్ట్రేషన్"గా పిలువబడే ఈ ప్రక్రియను శాస్త్రవేత్తలు ఒక ప్రధాన సహజ వాతావరణ పరిష్కారంగా భావిస్తున్నారు. సుస్థిర భూవినియోగ పద్ధతులు అనుసరించి నేలల్లో కార్బన్ నిల్వ చేసే రైతులకు ఆర్థిక ప్రోత్సాహకాలు అందించే "కార్బన్ ఫార్మింగ్" విధానాన్ని కూడా పరిశోధకులు ప్రోత్సహిస్తున్నారు. దీని ద్వారా రైతులకు అదనపు ఆదాయం లభించడమే కాకుండా పర్యావరణ పునరుద్ధరణకు సహకారం అందుతుంది.

ప్రకృతికి భూమిని తిరిగి ఇవ్వాల్సిన అవసరం ప్రస్తుత వ్యవసాయ విధానాలు ఇకపై కొనసాగలేవని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా వ్యవసాయ భూముల్లో దాదాపు 40 శాతం ఇప్పటికే క్షీణించగా, ప్రతి సంవత్సరం విపరీతమైన ఆహారం వృథా అవుతోంది. పారిస్ ఒప్పందం లక్ష్యాలను సాధించాలంటే క్షీణించిన వ్యవసాయ భూములలో గణనీయమైన భాగాన్ని తిరిగి అడవులు, గడ్డి భూములు, సహజ పర్యావరణ వ్యవస్థలకు అప్పగించాలని నిపుణులు సూచిస్తున్నారు. అలాగే తక్కువ నీటితో అధిక ఫలితాలు ఇచ్చే డ్రిప్ ఫర్టిగేషన్ వంటి నీటి-సమర్థ సాంకేతికతలను విస్తృతంగా అమలు చేయాలని సూచిస్తున్నారు. భవిష్యత్తు వ్యూహం "తక్కువ వనరులతో ఎక్కువ ఆహారం" ఉత్పత్తి చేయడంపై దృష్టి పెట్టాలని నిపుణులు చెబుతున్నారు తక్కువ భూమి, తక్కువ నీరు, తక్కువ ఎరువులు, తక్కువ శక్తి వినియోగంతో అధిక ఉత్పత్తి సాధించాల్సిన అవసరం ఉంది.

అత్యవసర విధాన చర్యల అవసరం

నేల ఆరోగ్య పునరుద్ధరణకు ప్రభుత్వాల నుండి బలమైన విధాన మద్దతు అవసరమని పర్యావరణ శాస్త్రవేత్తలు స్పష్టం చేస్తున్నారు. రైతులకు ప్రోత్సాహకాలు, పర్యావరణ సేవల చెల్లింపులు, సుస్థిర వ్యవసాయ కార్యక్రమాల ద్వారా మద్దతు అందించాల్సిన అవసరం ఉంది. ఇది కేవలం వ్యవసాయ సమస్య మాత్రమే కాదు; మానవ నాగరికతకు సంబంధించిన సవాలు. నేల క్షీణత వాతావరణ స్థిరత్వం, ఆహార ఉత్పత్తి, నీటి భద్రత, జీవ వైవిధ్యం, అంతిమంగా ప్రపంచ శాంతి, మానవ మనుగడపై ప్రభావం చూపుతోంది. పెరుగుతున్న ఉష్ణోగ్రతలు మరియు పర్యావరణ అస్థిరతను ఎదుర్కొంటున్న ఈ కాలంలో, భూమి నేలలు పునరుద్ధరించడం 21వ శతాబ్దంలో అత్యంత కీలకమైన కర్తవ్యాలలో ఒకటిగా మారవచ్చు.

కేరళ గెలుపులో రేవంత్ లెక్క...

హైదరాబాద్, – సూర్య వాస్తవం

ఐదు రాష్ట్రాలకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్క కేరళలో కాంగ్రెస్ నేతృత్వంలోని కూటమి యూడీఎఫ్ విజయం దక్కించుకుంది. ఇక్కడి 140 అసెంబ్లీ స్థానాల్లో 102 స్థానాల్లో కూటమి గెలుపు గుర్రం ఎక్కింది. అయితే.. ఈ విజయంలో పలువురి పాత్ర ఉన్నప్పటికీ.. ముఖ్యంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాత్రపైనే ఇప్పుడు ఆసక్తికర చర్చ సాగుతోంది. ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో రేవంత్ కేవలం కేరళపైనే ఎక్కువగా దృష్టి పెట్టారు. దాదాపు 18 రోజుల పాటు ఆయన ప్రచారం నిర్వహించారు. తొలి దశలో 7 రోజులు.. తర్వాత తర్వాత నాలుగు రోజుల చొప్పున ప్రచారంలో పాల్గొన్నారు. అయితే.. ఇది సాధారణ ప్రచారమైతే.. పెద్దగా చర్చ ఉండేది కాదు. కాంగ్రెస్ తరఫున ఎంతో మంది ప్రచారం చేశారు కాబట్టి.. ఆ లెక్కలో కలిసిపోయేది. కానీ, రేవంత్ చేసిన ప్రచారం విభిన్నంగా సాగింది. ఆయన కేరళకు, తెలంగాణలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వానికి మధ్య లింకు పెట్టి ప్రచారం సాగించారు.తిరువనంతపురం జిల్లా సహా.. పాలక్కాడు, పథనం తిట్ట వంటి తెలుగు వారి మూలాలు ఉన్న జిల్లాల్లో పెద్ద ఎత్తున రోడ్ షోలు.. ప్రసంగాలతో దంచి కొట్టారు. మరీ ముఖ్యంగా ఈ సమయంలో సీఎం పినరయి విజయన్‌ను ఢీ అంటే ఢీ అన్నట్టుగా రేవంత్ ఢీ కొట్టారు. ఆయనకు అనేక సవాళ్లు విసిరారు. పేద రికం నుంచి అవినీతి వరకు , నిరుద్యోగం నుంచి ఉపాధి కల్పన దాకా.. అనేక అంశాలను రేవంత్ ప్రస్తావించా రు. ఈ

క్రమంలో ఇరువురు ముఖ్యమంత్రుల మధ్య లేఖల యుద్ధం కూడా కొనసాగిందిఇది కేరళ కాంగ్రెస్ పార్టీ నాయకులకు కలసి వచ్చింది. రేవంత్ ప్రసంగాలను.. ముఖ్యంగా సీఎం పినరయి విజయన్ చేసిన ప్రసంగాలతో పోల్చుతూ.. స్థానికంగా బలంగా వినిపించారు. 'రైజింగ్ తెలంగాణ' మాదిరి గా 'రైజింగ్ కేరళ' మంత్రాన్ని జపించారు. నగరాలు, పట్టణాల్లో రేవంత్ ఫొటోలను ప్రచారంలోకి తీసుకువచ్చారు. ఆయన ప్రసంగాలను స్థానిక భాషలోకి అనువదించి.. మరింత విస్తారంగా ప్రచారంలోకి తెచ్చారు. మొత్తంగా కేరళ విజయంలో రేవంత్ రెడ్డి మాటల తూటాలు.. బాగానే పనిచేశాయి. సాధారణంగానే కాంగ్రెస్ పార్టీలో ముఖ్యమంత్రి పీఠం కోసం.. పోటీ కొనసాగుతుంది. అనేక మంది సీని యర్ నాయకులు ఈ జాబితాలో ముందున్నారు. ఇలాంటి వారిలో తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ కేసీ వేణుగోపాల్ సహా.. కీలక నేత సతీశన్, ఎంపీ శశిథరూర్‌వంటి హేమాహేమీలు కూడా పోటీపడు తున్నా రు. ఇక, యూడీఎఫ్ మిత్ర పక్షం ఆల్ ఇండియా ముస్లిం లీగ్(ఏఐఎంఎల్).. తన మద్దతు సతీశన్‌కేనని చెబుతోంది. ఈయన 2001 నుంచి ఇప్పటి వరకు అప్రతిహతంగా విజయం దక్కించుకున్నారు. పైగా పదేళ్లపాటు ప్రతిపక్ష నాయకుడిగా కూడా వ్యవహరించారు. మరోవైపు కేసీ వేణుగోపాల్ కూడా తానే ముఖ్యమంత్రినంటూ ప్రకటించుకుంటున్నారు. పార్టీని ముందుండి నడపడంలోనూ.. ఎన్నికల వేళ పార్టీని బలోపేతం చేయడంలోనూ ఆయన సేవలను ఎవరూ కాదనలేరు. ఇక, శశి థరూర్ వ్యవహారం కూడా పార్టీలో చర్చకు వచ్చినా.. ఆయనకు అదిష్టానం గ్రీన్ సిగ్నల్ ఇవ్వకపోవచ్చు. మరో వైపు ఇతర నేతల ప్రయత్నాలు కూడా కొనసాగుతున్నాయి. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డేనన్న ప్రచా రం జరుగుతోంది. ఆయన ఎన్నికల సమయంలోఅనుసరించిన వ్యూహాలు.. అప్పటి సీఎం విజయన్‌తో ఢీ అంటే ఢీ అన్నట్టుగా వ్యవహరించిన తీరుతో కాంగ్రెస్ పుంజుకుందని అంటున్నారు. ఈ క్రమంలో ఇప్పు డు ముఖ్యమంత్రి అభ్యర్థి ఎంపిక విషయంలోనూ.. రేవంత్ రెడ్డి కీలక పాత్ర పోషించనున్నట్టు తెలుస్తోంది. తాజాగా రేవంత్ రెడ్డి బుధవారం ఢిల్లీకి వెళ్లారు. ముఖ్యమంత్రి అభ్యర్థి విషయంలో రేవంత్‌కే ప్రాధాన్యం లభిస్తే.. ఆయన ఓటు కేసీ వేణుగోపాల్‌కే ఉంటుందన్న చర్చ కేరళలో జోరుగా సాగుతోంది. అయితే.. దీనిని సతీశన్ వర్గం తీవ్రంగా విభేదిస్తోంది. పార్టీని అన్ని విధాలా కాపాడిన తననే సీఎంను చేస్తారన్న నమ్మకం ఉందని సతీశన్ చెబుతున్నారు. ఈయన 'పెరవూరు' నియోజకవర్గంలో తిరుగులేని నాయకుడిగా పేరు తెచ్చుకున్నారు. మరి ఏం జరుగుతుందో చూడాలి.

రైతులకు సబ్సిడీపై రాయితీ వ్యవసాయ పనిముట్లు

- ఏవో మహబూబ్ బాషా

తాడిపత్రి - సూర్య వాస్తవం : యాడికి మండలంలోని రైతులకు వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద రాయితీపై ట్రాక్టర్లు, వ్యవసాయ యంత్ర పరికరాలు అందజేస్తున్నట్లు ఏవో మహబూబ్ బాషా తెలిపారు. ఈ పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ, సన్నకారు రైతులు, మహిళలకు యంత్రాల యూనిట్ ధరలో 50% రాయితీ లభిస్తుంది. ఓసీ, బీసీ, ఇతర రైతులకు 40శాతం వరకు రాయితీ అందుబాటులో ఉంది. అందజేస్తున్నారు. 40 హెచ్‌పీ వరకు సామర్థ్యం గల పెద్ద ట్రాక్టర్లతో పాటు, తోటల సాగుకు ఉపయోగపడే మినీ ట్రాక్టర్లు కూడా లభిస్తాయి. ట్రాక్టర్లతో పాటు ఇతర వ్యవసాయ యంత్ర పరికరాలు కూడా రాయితీపై అందుబాటులో ఉన్నాయి. సాగు పనులను సులభతరం చేయడం, కూలీల కొరతను అధిగమించడం. ఈ పథకం ప్రయోజనం పొందాలనుకునే యాడికి మండల రైతులు వెంటనే మీ ప్రాంతంలోని రైతు భరోసా కేంద్రం అధికారులను గానీ లేదా మండల వ్యవసాయ అధికారిని గానీ సంప్రదించి దరఖాస్తు చేసుకోవడం ఉత్తమం. కావాల్సిన పత్రాలు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డ్, బ్యాంక్ వివరాలు మొదలైనవి సిద్ధం చేసుకోండి.

కర్నూలు రోడ్డు రైల్వే గేటు వద్ద మరమ్మతులు

గుత్తి - సూర్య వాస్తవం : గుత్తి పట్టణంలోని గుత్తి పోలీస్ స్టేషన్ మీదగా బాట సుంకలమ్మ దేవ స్థానంకు వెళ్లే దారిలో ఉన్న రైల్వే గేటుని 09.05.2026వ తేదీ నుండి 13.05.2026 వ తేదీ వరకు మరమ్మతులు చేయడం జరుగుతుంది కనుక తాత్కాలికంగా మూసివేయడం జరుగుతుందని కావున వాహన దారులందరూ ద్విచక్ర వాహనాదా రులుకు మరియు ఆటోలకు రైల్వే గేట్ ప్రక్కన ఉన్నటువంటి బ్రిడ్జి మా ర్గం ద్వారా రాకపోకలు అవకాశం క లదు.మిగతా భారీ వాహనాలు అనగా లారీలు, బస్సులు, కార్లు, మొదల గు వాహనాలు అటువైపు రావడాని కి అవకాశం లేదు కనుక ప్రతి ఒక్క వాహనదారులు, ప్రయాణి కులు గమనించి మరమ్మతులు చేయు దినాలలో కొత్తపేట బ్రిడ్జి వైపు నుంచి ప్రయాణం సాగించాలని, ప్రయాణం చేసేటప్పుడు జాగ్రత్త వహించాలని గుత్తి సిఐ రామారావు, గుత్తి ఎస్సై సురేష్ తెలిపారు.

రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు

- దరఖాస్తులకు ఆహ్వానం

- మే 19 వరకు ఆన్లైన్‌లో దరఖాస్తులు స్వీకరణ

- రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి : ఏవో జగదీష్

కణేకల్- సూర్య వాస్తవం: రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం వ్యవసాయ యాంత్రీకరణ పథకం ద్వారా సబ్సిడీపై వివిధ వ్యవసాయ పనిముట్లు అందించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి జగదీష్ తెలిపారు. ఈ పథకం కింద ట్రాక్టర్ పనిముట్లు, స్ప్రేయర్లు, నూర్పిడి యంత్రాలు, ట్రాక్టర్లు, మినీ ట్రాక్టర్లు, పవర్ టిల్లర్లు తదితర యంత్ర పరికరాలను రాయితీ ధరలకు రైతులకు అందజేయనున్నట్లు వెల్లడించారు.ఆసక్తి గల రైతులు మే 6వ తేదీ నుండి మే 19వ తేదీ వరకు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఇందుకోసం సమీపంలోని రైతు సేవా కేంద్ర సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. ఈ పథకం కింద ఎస్సీ, ఎస్టీ, చిన్నకారు, సన్నకారు మరియు మహిళా రైతులకు 50 శాతం రాయితీ, ఇతర రైతులకు 40 శాతం రాయితీఅందించనున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన రైతులను జాయింట్ కలెక్టర్ సమక్షంలో లాటరీ విధానంలో ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకునే రైతులు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా వివరాలు తదితర అవసరమైన పత్రాలతో రైతు సేవా కేంద్రాన్ని సంప్రదించాలని ఏవో జగదీష్ సూచించారు. మండలంలోని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆధునిక వ్యవసాయ పరికరాలను పొందాలని కోరారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకుండా విద్యార్థుల భవిష్యత్తుని

అంధకారంలోకి నెట్టిన కూటమి ప్రభుత్వం

- అనంతపురం జిల్లా వైయస్ఆర్ విద్యార్థి భాగం జిల్లా ఉపాధ్యక్షుడు మంజునాథ్ రెడ్డి

ఉరవకొండ - సూర్య వాస్తవం : రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల సమస్య రోజు రోజుకు తీవ్రమవు తోందని, వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని అనంతపురం జిల్లా వైయస్ఆర్ విద్యార్థి విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు మంజునాథ్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఇంజినీరింగ్, డిగ్రీ, ఫార్మసీ, ఎంబీఏ, ఎంసీఏ, పీజీ తదితర కోర్సులు చదువుతున్న లక్షలాది మంది విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ మరియు స్కాలర్‌షిప్ బకాయిలు ఇంకా విడుదల కాలేదన్నారు. గత ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రతి ఏడాది వేల కోట్ల రూపాయలు విడుదల చేసి ఉన్నత విద్యకు భరోసా కల్పించిందన్నారు. కానీ ప్రస్తుతం కూటమి ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తోందని మంజునాథ్ రెడ్డి విమర్శించారు. రాష్ట్రంలో సుమారు 14 లక్షలకుపైగా విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంపై ఆధారపడి ఉన్నారన్నారు. గత బకాయిలతో కలుపుకుని 10,700 కోట్ల రూపాయలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని పేర్కొన్నారు. కళాశాల యాజమాన్యాలు ఫీజులు చెల్లించాలంటూ ఒత్తిడి తెస్తూ హాల్ టికెట్లు నిలిపివేయడం, సర్టిఫికెట్లు ఇవ్వక పోవడం, పరీక్షలకు అనుమతించకపోవడం వంటి చర్యలకు పాల్పడుతున్నాయని తెలిపారు.

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవీన్ రెడ్డి మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు అప్పులు చేసి చదువుకుంటున్న పరిస్థితిలో ప్రభుత్వం బకాయిలు విడుదల చేయకపోవడం అన్యాయమన్నారు. "విద్యకు ప్రాధాన్యం" అంటూనే విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడటం కూటమి ప్రభుత్వ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. అంతేకాకుండా గతంలో జగనన్న ప్రభుత్వం అమలు చేసిన పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానం వల్ల వేలాది మంది విద్యార్థులు ఉన్నత విద్యను కొనసాగించగలిగారని గుర్తు చేశారు. ఇప్పుడు ఆ వ్యవస్థను బలహీనపరచడం వల్ల గ్రామీణ, పేద విద్యార్థుల చదువులు మధ్యలోనే ఆగిపోయే ప్రమాదం ఏర్పడిందన్నారు.

అందువల్ల వెంటనే పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని, ఫీజుల పేరుతో వేధింపులకు పాల్పడుతున్న కళాశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడితే రాష్ట్రవ్యాప్తంగా వైయస్ఆర్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

ఉచిత కంటి మెగా వైద్య శిబిరం

పామిడి- సూర్య వాస్తవం : పామిడి పట్టణంలోని వాసవి కళ్యాణ మండపం (అమ్మవారి శాల) యందు మే 10వ తేదీ ఆదివారం బెంగళూరు పట్టణంలో ప్రఖ్యాతిగాంచిన శంకర కంటి ఆసుపత్రి ప్రముఖ కంటి వైద్య నిపుణుల చేత కంటి పరీక్షలు నిర్వహించబడును అని పామిడి లైన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు ప్రభుత్వ ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ నల్లపాటి తిరుపతి నాయుడు క్లబ్ అధ్యక్షుడు కె. రఘువీర్ రావ్ పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. ఉచిత కంటి వైద్య శిబిరం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పామిడి, ఇతర మండలాల ప్రజలు కంటి శిబిరంలో పాల్గొని కంటి వైద్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు. ఈ సదవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కంటి వైద్య శిబిరంలో పాల్గొనే వారు రెండు పాస్పోర్ట్ ఫోటోలు ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకొని రావాలని తెలిపారు. కంటి వైద్య శిబిరంలో ఆపరేషన్ కు ఎంపికైన వారిని అదే రోజు శంకర కంటి ఆసుపత్రి వారి బస్సులలో ఉచితంగా బెంగుళూరికి తీసుకుపోయి కంటి ఆపరేషన్ తదనంతరం పామిడికి చేర్చగలమని తెలిపారు.

గ్రామ సమస్యలు భూ వివాదాల పరిష్కారానికే ఒక నెల, ఒక గ్రామం కార్యక్రమం

- తహసీల్దార్ విజయ కుమారి

చెన్నూరు- సూర్య వాస్తవం: ప్రజా సమస్యలు వేగవంత పరిష్కరించేందుకు, భూ వివాదాల నివారించేందుకు ప్రజలకు పారదర్శక రెవిన్యూ శాఖ పరంగా తక్షణ సేవలందించేందుకు ఒక నెల, ఒక గ్రామం, నాలుగు సందర్శనల కార్యక్రమం చేపట్టినట్లు తహసీల్దార్ విజయ కుమారి అన్నారు. శుక్రవారం మండలంలోని గుర్రంపాడు గ్రామపంచాయతీలో గ్రామంలో కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆమె తెలిపారు. ఇందులో భాగంగా గ్రామ ప్రజల నుండి భూ సంబంధిత వినతులు, సమస్యలు స్వీకరించి సంబంధిత అధికారులకు తక్షణ చర్యల కోసం సూచించినట్లు ఆమె తెలిపారు. మండల స్థాయి అధికారులు అందరూ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని గ్రామస్థాయిలోనే ప్రజా సమస్యలను పరిష్కరించడం జరుగుతున్నదని ఆమె తెలిపారు.ఈ కార్యక్రమం ద్వారా రెవెన్యూ సంబంధిత వివాదాలు తో పాటు ప్రజలకు వేగవంతమైన సేవలు అందుతాయని ఆమె అన్నారు. గ్రామ ప్రజలు కూడా తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చి తమ సమస్యలను పరిష్కరించు కోవాలని ఆమె తెలిపారు. ఇంకా ఏవైనా సమస్యలున్నచో తమ దృష్టికి తీసుకురావాలని ఆమె ప్రజలను కోరారు. ప్రభుత్వ అధికారులు అంతా కూడా తమ ఊరికి తమ గ్రామానికి వచ్చి అక్కడి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకొని పరిష్కార మార్గం చూపడం జరుగుతుందని ఆమె తెలిపారు. ప్రభుత్వం కల్పించిన ఈ చక్కటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని ఆమె తెలియజేశారు.

దుర్గం గ్రామాభివృద్ధికి శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే బండారు శ్రావణి

నార్పల - సూర్య వాస్తవం : నార్పల మండలంలోని దుర్గం గ్రామంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమల్లో భాగంగా ? రూ. 7.5 లక్షల వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే బండారు శ్రావణి ప్రారంభించారు. ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ కూటమి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని ఆమె పేర్కొన్నారు. గ్రామంలో రవాణా సౌకర్యాలను మెరుగుపరచడానికి రూ. 7 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును కూడా ప్రారం భించారు. రానున్న రోజుల్లో గ్రామంలో ఉన్న మిగిలిన సమస్యలను కూడా ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని ఎమ్మెల్యే గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దుర్గం గ్రామస్తులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు. ?ప్రజా ప్రతినిధులు క్షేత్రస్థాయిలో పర్యటించి ఇలాంటి మౌలిక సదుపాయాలపై దృష్టి సారించడం గ్రామాల అభివృద్ధికి ఎంతో దోహదపడుతుంది.

32 కులాల సంచారజాతలకు డీఎన్‌టీ, ఎన్‌టి సర్టిఫికెట్ల పట్ల హర్షం

- కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి ఫలితంగానే సంచారజాతలకు సర్టిఫికెట్లు

-జిల్లా బిజెపి ఓబిసి ఉపాధ్యక్షుడు దొమ్మర శ్రీనివాసులు

చెన్నూరు - సూర్య వాస్తవం: 32 కులాల సంచారజాతలకు డిఎన్టి, ఎన్ టి, సర్టిఫికెట్ విడుదల చేయడంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై సంచార జాతుల నాయకులు, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. దీని కొరకు సంచారజాతులు ఎన్నో సంవత్సరాలుగా ప్రభుత్వాలను కోరడం జరిగిందని అయితే ఇప్పటి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఫలితంగానే సంచార జాతులకు విముక్తి కలిగిందని జిల్లా బిజెపి ఓ బి సి ఉపాధ్యక్షుడు. దొమ్మర శ్రీనివాసులు పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ఆయన చెన్నూరులో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి ఫలితంగానే సంచార జాతులకు సర్టిఫికెట్లు విడుదల అయ్యాయని కొనియాడారు. ఎండలోను వానలోనూ తడుస్తూ సంచారం చేసే జాతులకు విముక్తి కల్పించడంలో ప్రభుత్వాలు సంచారజాతుల బాధలు తెలుసుకొని వారికి డిఎన్టి, ఎన్టీ సర్టిఫికెట్ లు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఏప్రిల్ 17వ తేదీన విజయవాడలో రాష్ట్ర బిజెపి కార్యాలయంలో డిఎన్టి 32 కులాల ప్రతినిధులు. కేంద్ర డిఎన్టి పోర్ట్ సభ్యులు ప్రవీణ్ గూడె. భరత్ భాయ్. రాష్ట్ర బిజెపి ఓ బి సి మోర్చా అధ్యక్షులు గోపి శ్రీనివాసులు. డిఎన్టి రాష్ట్ర కన్వీనర్ చంద్రశేఖర్. గోపాల్ వెంకటేష్ సమావేశంలో చర్చించడం జరిగింది అన్నారు. సమావేశం జరిగి నెల గడవక ముందే సంచార జాతుల డిఎన్టి 32 కులాల సర్టిఫికెట్లు జారీ చేయడంలో ప్రభుత్వం స్పందించి ఉత్తర్వులు జారీ చేయడం కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పై హర్ష వ్యక్తం చేశారు. సర్టిఫికెట్లు ఆధారంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు బ్యాంకు రుణాలు వివిధ పథకాలు అందుతాయి అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 10 లక్షల మంది సంచార జాతుల కుటుంబాల కు సర్టిఫికెట్లు అందుతాయిఅయన తెలిపారు . ఈ సర్టిఫికెట్లు పొందడానికి మీసేవ కేంద్రాలు గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. డిఎన్టి 32 సంచార జాతులకులాలకు సర్టిఫికెట్లు మంజూరుకు కృషి చేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేంద్ర రాష్ట్ర మంత్రులకు, డిఎన్టి బోర్డు సభ్యులు ప్రవీణ్ గుడే. భరత్ భాయ్. బిజెపి ఓబీసీ మోర్చా అధ్యక్షులు గోపి శ్రీనివాసులు. రాష్ట్ర డిఎన్టి కన్వీనర్ చంద్రశేఖర్. తదితరులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

గతి తప్పిన భారత ఉత్పత్తి రంగం

డా. ముచ్చుకోట సురేష్ బాబు



అనంతపురం – సూర్య వాస్తవం : గత మూడు దశాబ్దాలుగా భారత ఆర్థిక ప్రయాణం వేగవంతమైన వృద్ధి, గ్లోబల్ సమీకరణ, సాంకేతిక ప్రతిభతో ప్రశంసలు పొందుతోంది. మరోవైపు నిర్మాణాత్మక బలహీనత దాగి పరిశ్రమల క్షీణత అంతర్లీనంగా ఉంది, తయారీ రంగం నిరంతరంగా వెనుకబడటం. చైనా, దక్షిణ కొరియా వంటి దేశాలు పారిశ్రామిక శక్తులుగా ఎదిగినప్పుడు, భారత తయారీ రంగం స్థబ్దంగా ఉండటం దేశ వృద్ధి నమూనా స్థిరత్వం సమగ్రతపై తీవ్రమైన సందేహాలను రేకెత్తిస్తోంది.

ఎప్పుడూ పూర్తిగా ఎదగని రంగం

20వ శతాబ్దం ప్రారంభంలో భారత్, చైనా, దక్షిణ కొరియా దేశాలు సమాన ఆర్థిక స్థితిలో ప్రారంభమయ్యాయి. కానీ నేడు పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉంది. చైనా, దక్షిణ కొరియాలలో తయారీ రంగం ఆర్థిక మార్పుకు పునాది అయింది; ఎగుమతులు, ఉపాధి, సాంకేతిక అభివృద్ధికి ప్రధాన ఆధారంగా నిలిచింది. భారతదేశంలో మాత్రం ఈ రంగం జీడీపీలో వాటా దశాబ్దాలుగా 17--18% వద్దనే నిలిచిపోయి, ఇటీవలి కాలంలో సేవల రంగానికి కూడా స్థానం కోల్పోయింది. ఈ నిర్మాణ అసమతౌల్యం "ప్రీమేచ్యూర్ డీ ఇండస్ట్రియలైజేషన్" అనే పరిస్థితికి దారితీసింది. అంటే బలమైన పారిశ్రామిక పునాది లేకుండానే దేశం సేవల ఆధారిత ఆర్థిక వ్యవస్థగా మారడం. దీని ఫలితంగా తక్కువ ఉపాధి సృష్టి, ఆదాయ అసమానతల పెరుగుదల, బలహీన ఎగుమతి నిర్మాణం వంటి సమస్యలు కనిపిస్తున్నాయి.

వృద్ధి మందగింపు మరియు ఉద్యోగ నష్టం

ఇటీవలి గణాంకాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఒకప్పుడు 9% కంటే ఎక్కువగా ఉన్న తయారీ వృద్ధి, 2026 మార్చి నాటికి నాలుగేళ్ల కనిష్టానికి పడిపోయింది. పరిశ్రమ ఉత్పత్తి అనేక నెలల్లో స్థిరంగా లేక తగ్గుతూ ఉండటం లోతైన సమస్యలను సూచిస్తోంది. ఉపాధి పరిస్థితి కూడా ఆందోళనకరంగానే ఉంది. 2004--05 నుండి 2009--10 మధ్యలో ఆర్గనైజ్డ్ తయారీ రంగంలో మూడు మిలియన్లకు పైగా ఉద్యోగాలు సృష్టించబడినప్పటికీ, అదే సమయంలో అన్‌ఆర్గనైజ్డ్ రంగంలో భారీగా ఉద్యోగాలు తగ్గాయి. మొత్తం తయారీ ఉద్యోగుల్లో 80శాతం మంది పనిచేసే ఈ అన్‌ఆర్గనైజ్డ్ రంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. 1993--2005 మధ్య 12.6 మిలియన్ ఉద్యోగాలు పెరిగిన ఈ రంగంలో, 2004--2012 మధ్య కేవలం ఒక మిలియన్ మాత్రమే కొత్త ఉద్యోగాలు సృష్టించబడ్డాయి. టెక్స్‌టైల్స్, గార్మెంట్స్, లెదర్ వంటి శ్రామికాధారిత పరిశ్రమలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. రూపాయి విలువ పెరగడం, ముడి పదార్థాల ధరల మార్పులు, ప్రపంచ ఆర్థిక సంక్షోభాల సమయంలో డిమాండ్ తగ్గడం ఇవన్నీ ఈ రంగాల వృద్ధిని అడ్డుకున్నాయి.

నిర్మాణాత్మక అవరోధాలు, విధాన లోపాలు

భారత తయారీ రంగం వెనుకబడటానికి కారణాలు కొత్తవి కావు. మౌలిక సదుపాయాల లోపం ప్రధాన అడ్డంకిగా ఉంది. విద్యుత్ కొరత, రవాణా లోపాలు, పరిశ్రమల మౌలిక సదుపాయాల లోపం ఉత్పత్తి ఖర్చులను పెంచుతూ పోటీ సామర్థ్యాన్ని తగ్గిస్తున్నాయి. కోయంబత్తూర్ వంటి పరిశ్రమల నగరాల్లో ఫ్యాక్టరీలు విద్యుత్ కొరత వల్ల సగం సామర్థ్యంతో పని చేసిన సందర్భాలు ఉన్నాయి. చిన్న, సూక్ష్మ మరియు మధ్య తరహా పరిశ్రమలకు రుణాల అందుబాటు కూడా పెద్ద సమస్య. బ్యాంకు రుణాల్లో ఈ రంగానికి లభించే వాటా తగ్గిపోవడం వల్ల చాలా సంస్థలు అనధికారిక మరియు ఖరీదైన వనరులపై ఆధారపడాల్సి వస్తోంది. అలాగే సంక్లిష్ట నియంత్రణలు, కఠిన కార్మిక చట్టాలు సంస్థల విస్తరణను అడ్డుకుంటున్నాయి. భూమి సమీకరణ ఖర్చులు, అనుమతుల ఆలస్యం, అధిక పరిపాలనా భారాలు సమస్యలను మరింత పెంచుతున్నాయి. అదే సమయంలో పరిశోధన అభివృద్ధిలో తక్కువ పెట్టుబడులు సాంకేతిక పురోగతిని మందగింపజేశాయి.

దిగుమతుల సవాలు

యంత్రాలు మరియు రవాణా పరికరాల రంగాల్లో దిగుమతులపై అధిక ఆధారపడటం మరో పెద్ద సమస్యగా మారింది. ముఖ్యంగా చైనా నుంచి పెరుగుతున్న దిగుమతులు చిన్న పరిశ్రమల అవకాశాలను తగ్గిస్తున్నాయి. దీనివల్ల స్థానిక తయారీ వ్యవస్థ బలహీనపడటమే కాకుండా వాణిజ్య లోటు కూడా పెరుగుతోంది.

విధాన ప్రాధాన్యతలపై ప్రశ్నలు

ఆర్థికవేత్త అరవింద్ సుబ్రహ్మణ్యం ఒక ఆసక్తికరమైన విశ్లేషణను అందించారు. "డచ్ డిసీజ్" సిద్ధాంతాన్ని ఆధారంగా తీసుకుని, ప్రభుత్వ రంగంలో అధిక వేతనాలు కార్మికులను తయారీ రంగం నుండి దూరం చేశాయని, దీనివల్ల ఖర్చులు పెరిగి పోటీ సామర్థ్యం తగ్గిందని ఆయన అభిప్రాయపడ్డారు. ఇది సమస్యలో ఒక కోణం మాత్రమే అయినప్పటికీ, విధానాల ప్రభావాన్ని అర్థం చేసుకోవాల్సిన అవసరాన్ని ఇది సూచిస్తోంది.ప్రొడక్షన్-లింక్డ్ ఇన్సెంటివ్ పథకాలు వంటి కొన్ని ప్రభుత్వ చర్యలు మంచి ఫలితాలను చూపిస్తున్నాయి, ముఖ్యంగా ఎలక్ట్రానిక్స్ రంగంలో. 2035 నాటికి తయారీ రంగం జీడీపీ లో 25% వాటా సాధించాలనే లక్ష్యంతో జాతీయ తయారీ మిషన్ కూడా ప్రతిపాదించబడింది. కానీ ఎలక్ట్రానిక్స్ ఇతర అనుబంధ పరిశ్రమ కేవలం గుజరాత్ రాష్ట్రానికే పరిమితమైంది. అయితే ఈ ప్రయత్నాలు లోతైన నిర్మాణాత్మక సమస్యలను ఎదుర్కోవాల్సి ఉంది. హైటెక్ రంగాల్లో కొంత పురోగతి కనిపించినప్పటికీ, మొత్తం తయారీ విస్తరణ ఇంకా మందగంగా ఉంది. ప్రపంచ అనిశ్చితి, భౌగోళిక ఉద్రిక్తతలు, సరఫరా గొలుసు అంతరాయాలు వంటి అంశాలు కూడా సవాళ్లను పెంచుతున్నాయి.

ముందున్న మార్గం

భారతదేశం కీలక దశలో ఉంది. బలమైన, సమగ్ర తయారీ రంగం లేకుండా దేశం తన జనాభా లాభాన్ని కోల్పోయే ప్రమాదం ఉంది. పెరుగుతున్న యువ జనాభాకు తగిన ఉపాధి కల్పించడం కష్టమవుతుంది. తయారీ రంగ పునరుజ్జీవనం సాధించాలంటే కేవలం చిన్న మార్పులు సరిపోవు. మౌలిక సదుపాయాలు విద్యుత్ రంగంలో భారీ పెట్టుబడులు, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు సులభ రుణాలు, నియంత్రణల సరళీకరణ, శ్రామికాధారిత పరిశ్రమలకు ప్రోత్సాహం, దేశీయ పరిశ్రమలను బలోపేతం చేసే వాణిజ్య విధానాలు, అలాగే సాంకేతిక నవీనతపై ఎక్కువ దృష్టి అవసరం.భారత వృద్ధి కథ కేవలం సేవల రంగంపైనే ఆధారపడలేను. బలమైన తయారీ రంగం ఆర్థిక స్థిరత్వం, సామాజిక సమానత్వం, ఉపాధి సృష్టికి కీలకం. ఇప్పుడు ప్రశ్న తయారీ ఆధారిత వృద్ధి అవసరమా కాదా అనేది కాదు – అది సాధించేందుకు భారత్ తక్షణ చర్యలు తీసుకుంటుందా లేదా అనేది.

అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ముస్లిం విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలకు ఆహ్వానం

హిందూపురం – సూర్య వాస్తవం : హిందూపురం శ్రీ సత్య సాయి జిల్లా హిందూపురం ముస్లిం సామాజిక వర్గానికి చెందిన విద్యార్థినీ విద్యార్థులు ఈ విద్యా సంవత్సరం (2025-26) ఇంటర్మీడియట్ , పదవ తరగతి పరీక్షా ఫలితాలు, నీట్, జేఈఈలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ముస్లిం విద్యార్థులకుఅఖిల భారత షహీద్ టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ ఉముస్లిం జేఏసీ ఆధ్వర్యంలో షహీద్ టిప్పు సుల్తాన్ ఉత్తమ విద్యా ప్రతిభాపురస్కారాలు ఇవ్వనున్నట్లు అఖిల భారత షహీద్ టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ వ్యవస్థాపక అధ్యక్షులు కల్లూరు మొహమ్మద్ ఉమర్ ఫారూఖ్ ఖాన్ తెలియజేశారు. అర్హత వుండి ఆసక్తి కలిగిన వారు వెంటనే శనివారం లోపల దరఖాస్తులను 9346943336 వాట్సాప్ కు వివరాలు పంపవలసిందిగా విజ్ఞప్తి చేశారు. అర్హతలు ఇంటర్మీడియట్ 850 మార్కులు ఆపైన సాధించిన ప్రభుత్వ ప్రైవేటు కళాశాల విద్యార్థులు పదవ తరగతిలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు 500 మార్కులు ఆపై సాధించిన ప్రైవేటు పాఠశాల విద్యార్థులు అర్హులన్నారు. దరఖాస్తుతో పాటు ఆన్లైన్ మార్కుల జాబితా కుల ధ్రువీకరణపత్రం పాస్పోర్ట్ సైజ్ ఫోటో జిరాక్స్ కాపీలను మీ ఫోన్ నెంబర్ తో సహా తప్పక జతపరచాలి

దిగ్విజయంగా ముగిసిన "ఉచిత కంటి వైద్య" శిబిరం !

- 91 మందికి కంటి ఆపరేషన్లు, 868 మందికి వైద్య పరీక్షలు

పత్తికొండ టౌన్ – సూర్య వాస్తవం : పత్తికొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పూర్వ విద్యార్థులు యువ స్పందన సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరం దిగ్విజయంగా ముగిసిందని పూర్వ విద్యార్థులు అడ్వకేట్ సురేష్ కుమార్, సీనియర్ లెక్చరర్ వీరేశప్ప తెలిపారు. శుక్రవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఉచిత కంటి వైద్య శిబిరం యందు కంటి ఆపరేషన్లు చేయించుకున్న వారికి సలహాలు, సూచనలను ఆసుపత్రి నిర్వాహకులు అరుల్ అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... బెంగళూరు చిట్టెం హనుమాన్ ప్రసాద్, చెన్నై శంకర నేత్రాలయ ఆసుపత్రి సహకారంతో అత్యాధునిక పరికరాలతో తొమ్మిది రోజుల నుండి కంటి వైద్య పరీక్షలు, కంటి ఆపరేషన్లు నిర్వహి స్తున్నామని పేర్కొన్నారు. ఉచిత కంటి వైద్య శిబిరానికి పత్తికొండ డివిజన్ చుట్టుపక్కల కాక కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయము, డోన్, గుంటకల్ చుట్టు పక్కల గ్రామాలతో పాటు రాయచూర్ నుండి అధిక సంఖ్యలో ప్రజలు వచ్చారని పేర్కొన్నారు. ఉచిత కంటి వైద్య శిబిరంలో 868 మంది వైద్య పరీక్షలు చేయించుకోగా, 91 మందికి కంటి ఆపరేషన్లను డాక్టర్ నివేదిత, డాక్టర్ సెమిమేరీ లు చేశారని వివరించారు. కంటి ఆపరేషన్లకు వచ్చిన ప్రజలకు డిటైర్డ్ టీచర్ ఏ.వరలక్ష్మి, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ ప్రమోద్ కుమార్ రెడ్డి, డాక్టర్ ఇలియాస్ భాష, వివిఆర్ గ్రాండ్ లాడ్జి ప్రొప్రైటర్ నాగరాజు, టీచర్ పందికోన మహేష్ లు అన్నదానం నిర్వహించారు. కంటి ఆపరేషన్లు చేయించుకున్న ప్రతి ఒక్కరూ శనివారం ఉదయం 9 గంటలకు ప్రభుత్వ జూనియర్ కళాశాల దగ్గరకు రావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో యువ స్పందన సొసైటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు సురేంద్ర, లక్ష్మన్న, సెక్రటరీ నాగరాజు, సభ్యులు మధు, రమేష్, గిరి, రాజేశ్వరి, వాలంటీర్లు, ఆసుపత్రి సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

రైతుల సమస్యలపై వైసీపీ ఇన్‌చార్జి మహాధర్నా

మడకశిర – సూర్య వాస్తవం : రైతులు సమస్యలపై వైసీపీ ఇన్‌చార్జి ఈర లక్కప్ప నేతృత్వంలో మడకశిర ఆర్డీవో కార్యాలయం ముందు మహాధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈర లక్కప్ప మాట్లాడుతూ పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నుండి న్యాయం జరగాలని డిమాండ్ చేయడం.జరిగింది. ?అల్ప వర్షాల కారణంగా పంటలు సరిగా పండక రైతులు తీవ్రంగా నష్టపోయారు. పండిన కొద్దిపాటి పంటకు కూడా మార్కెట్‌లో సరైన గిట్టుబాటు ధర లభించడం లేదు. దళారుల ప్రమేయం వల్ల రైతులు తమ ఉత్పత్తులను తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వస్తోందని, దీనివల్ల ఆర్థికంగా మరింత కుంగిపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి, నష్టపోయిన రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

టీడీపీ సభ్యుల కమిటీ సమావేశం

తనకల్లు – సూర్య వాస్తవం : శ్రీ సత్య సాయి జిల్లా తనకల్లు మండలం గేమే నాయక్ తాండ గ్రామపంచాయతీ పరిధిలో కదిరి శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ ఆదేశాలతో తెలుగుదేశం పార్టీ గ్రామ కమిటీ సభ్యులు సమావేశం జరిపించారు. ఈ సమావేశంలో గ్రామ అధ్యక్షుడు సి. సోమశేఖర్ మాట్లాడుతూ గ్రామాల్లో వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో చేయవలసిన పనులు గురించి మాట్లాడడం జరిగింది గ్రామాల్లో మౌలిక సదుపాయాలు వేసవి కాలం కావడంతో తాగునీటి సమస్య పై విద్యుత్ వీధి దీపాలు డ్రైనేజీలు వివిధ గ్రామ తండాలలో సీసీ రోడ్లు మరియు బిటి రోడ్లు డ్రైనేజీలు కొత్త పెన్షన్లు పక్కా గృహాలు రైతుల సమస్యపై జే జే యం గ్రాండ్ లో వేసిన తాగునీటి బోర్లకు విద్యుత్ కనెక్షన్లు కల్పించడం పై వివిధ అంశాలపై చర్చించడం జరిగింది ఈ సమావేశ కార్యక్రమంలో యూనిట్ ఇంచార్జ్ ఉత్తన్న నాయక్, బూత్ కన్వీనర్ ఎం భాస్కర్ నాయక్, గ్రామ కమిటీ ప్రధాన కార్యదర్శి మునిస్వామి నాయక్ , శివా నాయక్, శాంతమ్మ గ్రామ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

మహానాడు రవాణా కమిటీ కో -కన్వీనర్‌గా నియమితులైన మంత్రి మండిపల్లికి శుభాకాంక్షలు

రాయచోటి-సూర్య వాస్తవం: తెలుగు దేశం పార్టీ మహానాడు 2026 మే 27 నుంచి 29 వరకు జరిగే పండగ సందర్ మహానాడు కమిటీ లో రవాణా కమిటీ కో-కన్వీనర్‌గా నియమితులైన రాష్ట్ర రవాణా,యువజన క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి నియమితులైన సందర్భంగా శుక్రవారం తెలుగుదేశం పార్టీ మైనార్టీ శ్రేణులు ఉదయగిరి మస్తాన్, అప్రోఫ్ అలి, డీలర్ ఎజాస్, రాహుల్ హమీద్, ఇమ్రాన్ అలీలు సంతోషం వ్యక్తం చేస్తూ మంత్రికి హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి, కార్యకర్తల సంక్షేమానికి, ప్రజాసేవకు ఎల్లప్పుడూ అంకితభావంతో ముందుకు సాగుతున్న మంత్రి మండిపల్లి నాయకత్వం ఇంకా ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని వారు ఈ సందర్భంగా ఆకాంక్షించారు.మహానాడు విజయవంతం కావాలని మనసారా వారు కోరుకున్నారు.

నిరుపేదలకు పంపిణీ చేయనున్న ఇంటి స్థలాలను పరిశీలించిన ఆర్థికమంత్రి

ఉరవకొండ – సూర్య వాస్తవం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ఉరవకొండ నియోజకవర్గంలో పర్యటించారు. నిరుపేదలకు పంపిణీ చేయబోయే ఇంటి పట్టాల కోసం తగిన స్థలాలను ఎంపిక చేసే ప్రక్రియలో భాగంగా ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపారు. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సంబంధిత ప్రభుత్వ అధికారులు. నిరుపేదలకు పంపిణీ చేయనున్న ఇంటి స్థలాల (పట్టాల) కోసం అనువైన ప్రభుత్వ భూములను పరిశీలించడం. అర్హులైన లబ్ధిదారులకు త్వరితగతిన నివాస స్థలాలను కేటాయించేలా అధికారులకు దిశానిర్దేశం చేయడం. అధికారులతో కలిసి మంత్రి ప్రతిపాదిత స్థలాలను స్వయంగా పరిశీలించి, మౌలిక సదుపాయాలకు అనుకూలంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చెన్నూరు– సూర్య వాస్తవం : విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, 11 కెవి లైన్లు, ఇతర విద్యుత్ పరికరాల అత్యవసర నిర్వహణ పనుల దృష్ట్యా రెండవ శనివారం ఉదయం 8:00 గంటల నుండి మధ్యాహ్నం 2:00 గంటల వరకు చెన్నూరు మండలం వ్యాప్తంగా విద్యుత్ సరఫరా పూర్తిస్థాయిలో నిలిపివేయబడనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ రామలింగారెడ్డి తెలిపారు. ప్రజలకు మెరుగైన, నిరంతర, సురక్షిత విద్యుత్ సరఫరా అందించేందుకు ఈ నిర్వహణ పనులు చేపడుతున్నామని ఆయన పేర్కొన్నారు. కావున మండల ప్రజలు ముందస్తుగా అవసరమైన ఏర్పాట్లు చేసుకొని విద్యుత్ శాఖకు సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

తహశీల్దార్ కార్యాలయ పునరుద్ధరణ పనులను పరిశీలించిన ఆర్థికమంత్రి

ఉరవకొండ – సూర్య వాస్తవం : ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ నియోజకవర్గ పర్యటనలో భాగంగా ఉరవకొండలోని రెవెన్యూ కార్యాలయాన్ని సందర్శించి, అక్కడ జరుగుతున్న మార్పులను క్షుణ్ణంగా పరిశీలించారు. మౌలిక వసతుల కల్పన కార్యాలయానికి వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు భవన మరమ్మతులు, తాగునీరు, కూర్చోవడానికి అవసరమైన వసతులపై అధికారులకు సూచనలు చేశారు. పాతబడిన భవన భాగాన్ని ఆధునీకరించడంపై దృష్టి పెట్టారు.

సేవల నాణ్యతపై సమీక్ష

ప్రభుత్వ సేవలు సామాన్యులకు వేగంగా అందాలని మంత్రి స్పష్టం చేశారు. ముఖ్యంగా కుల, ఆదాయ, మరియు ఇతర సర్టిఫికేట్ల జారీలో జాప్యం జరగకూడదు. కార్యాలయ సిబ్బంది నిర్దిష్ట సమయానికి అందుబాటులో ఉండాలి. రెవెన్యూ సంబంధిత సమస్యల పరిష్కారంలో ప్రజలకు ఇబ్బంది లేకుండా పారదర్శకంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. అధికారులతో చర్చ. నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్లకు, అధికారులకు సూచించారు. కార్యాలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని కోరారు. నియోజకవర్గ కేంద్రంలోని ప్రధాన ప్రభుత్వ కార్యాలయం అధునాతనంగా మారడం వల్ల చుట్టుపక్కల మండలాల ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందుతాయని ఆశిస్తున్నారు. మంత్రి చొరవ స్థానిక ప్రజల ప్రశంసలు అందుకుంటోంది.

పలు వివాహ కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ

శింగనమల– సూర్య వాస్తవం : శింగనమల నియోజకవర్గ పరిధిలోని పలు వివాహ కార్యక్రమాల్లలో పాల్గొన్ని నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేసిన ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొత్తగా పెళ్లి చేసుకుని ఒకటైన నూతన జంటలు అందరూ వారి వైవాహిక జీవితం ఆనందంగా సుఖ సంతోషాలతో పిల్లాపాపలతో నిండు నూరేళ్లు వర్ధిల్లాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం కార్యకర్తలు నాయకులు పాల్గొని నూతన జంటలను ఆశీర్వదించారు.

పలు వివాహ వేడుకల్లో పాల్గొన్న వై.విశ్వేశ్వర రెడ్డి

ఉరవకొండ – సూర్య వాస్తవం : ఉరవకొండ నియోజకవర్గంలో జరిగిన పలు వివాహ శుభకార్యక్రమాల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వై. విశ్వేశ్వర రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి సీపి వీరన్న పాల్గొని సందడి చేశారు. నేడు వివిధ గ్రామాల్లో జరిగిన వివాహ వేడుకలకు వారు హాజరై వధూవరులకు శు భాకాంక్షలు తెలియజేశారు. గుంతకల్లు మండలం నాగసముద్రం గ్రామంలో కట్టా శ్రీనివాస రెడ్డి నివాసంలో జరిగిన శుభకార్యానికి హాజరయ్యారు. చీకల గురికి గ్రామం బండారు బండయ్య కుటుంబ సభ్యుల వివాహ వేడుకలో పాల్గొని, గ్రామ పెద్దలతో ముచ్చటించారు. విడపనకల్లు మండలం కరకముక్కల గ్రామంలో నాగేశ్వర రెడ్డి కుటుంబ వేడుకకు హాజరయ్యారు. కూడేరు మండలం బ్రహ్మణపల్లి గ్రామంలో జరిగిన వివాహ కార్యక్రమానికి విచ్చేసి నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమాల్లో వై. విశ్వేశ్వర రెడ్డి పాటు సి.పి. వీరన్న ,స్థానిక వైస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

తమిళనాడు గవర్నర్ వైఖరి
అప్రజాస్వామికం, రాజ్యాంగ వ్యతిరేకం, అనైతికం

- బిజెపి చేతిలో గవర్నర్ కీలుబొమ్మ
- బలనిరూపన కావాల్సింది అసెంబ్లీలో గవర్నర్ బంగ్లాలో కాదు
- విజయ్‌ని గవర్నర్ ఆహ్వానించాలి
- డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి

వేంపల్లె – సూర్య వాస్తవం: తమిళనాడు ఇన్చార్జి గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్ వైఖరి అప్రజా స్వామికం, రాజ్యాంగ వ్యతిరేకం, అనైతికమని రాజ్యసభ మాజీ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి అన్నారు. శుక్రవారం వేంపల్లి లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ తమిళనాడు గవర్నర్ బిజెపి చేతిలో కీలుబొమ్మగా వ్యవహరిస్తున్నారని, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని విరుచుకుపడ్డారు. బల నిరూపణ కావాల్సింది అసెంబ్లీలో. గవర్నర్ బంగ్లాలో కాదు అని ధ్వజమెత్తారు. రాజ్యాంగంలో 164 అధికరణ ప్రకారంగా నైనా, గతంలో జరిగిన అనేక సందర్భాల పరంగా నైనా, సుప్రీంకోర్టు తీర్పుల ప్రకారంగా నైనా, సర్కారియా కమిషన్ తదితర కమిషన్ల నివేదికల ప్రకారంగా నైనా శాసనసభలో ఏకైక అతిపెద్ద పార్టీ నాయకుడైన విజయ్ ను గవర్నర్ తక్షణమే ముఖ్యమంత్రిగా ఆహ్వానించి శాసనసభ విశ్వాసం చూరగొనే అవకాశం ఇవ్వాలని తులసి రెడ్డి అన్నారు.

2013లో ఢిల్లీ శాసనసభ ఎన్నికల్లో, 2018లో కర్ణాటక శాసనసభ ఎన్నికల్లో, 2019లో మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో 1996లో లోక్సభ ఎన్నికల్లో ఏకైక అతి పెద్ద పార్టీ నాయకులను మొట్టమొదట ఆహ్వానించడం జరిగింది అని తులసి రెడ్డి గుర్తు చేశారు. బిజెపి నాయకులు కక్కుర్తి రాజకీయాలకు పాల్పడం అత్యంత దురదృష్టకరమని తులసి రెడ్డి అన్నారు. ఇక ఏమాత్రం ఆలస్యం చేయకుండా తక్షణమే విజయ్ ను ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని, అసెంబ్లీలో బల నిరూపణకు అవకాశం ఇవ్వాలని తులసి రెడ్డి డిమాండ్ చేశారు.

మీడియా సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కదిరి ప్రసాద్ గౌడ్, ఎస్సీ సెల్ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లెం విజయభాస్కర్,సీనియర్ కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్ రెడ్డి,ఉత్తన్న తోపిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఒక నెల..ఒకగ్రామం..
నాలుగు సందర్శనలు విజయవంతం చేయాలి

- తహశీల్దార్ నరసింహ కుమార్ రాయచోటి

అన్నమయ్య బ్యూరో– సూర్య వాస్తవం:

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనున్న వినూత్న కార్యక్రమం రాష్ట్ర ముఖ్యమంత్రి వారి ఆదేశాల మేరకు రెవెన్యూ వ్యవస్థలో కీలక నిర్ణయం ప్రతి జిల్లాలో ప్రతి మండలంలో ప్రతి గ్రామంలో ఈ ప్రజా ఫిర్యాదులను వేగవంతంగా పరిష్కరించే వినూత్న కార్యక్రమం.

"ఒక నెల– ఒక గ్రామం–నాలుగు సందర్శనలు"

మొదటి సందర్శన – ఫిర్యాదుల నమోదు

అసైన్డ్ భూముల వివరాలను చదవడం. సెక్షన్ 22-ూ కింద నిషేధిత ఆస్తుల వివరాలను చదవడం. గ్రామ ట్యాంకులు, నీటి వనరుల వివరాలను చదవడం. ప్రజా ప్రయోజనాల కోసం స్వాధీనం చేసుకున్న భూముల (ఇళ్ల స్థలాలు సహా) వివరాలను చదవడం. అసైన్డ్ భూములు, నిషేధిత ఆస్తులు, స్వాధీనం చేసుకున్న భూములు, నీటి వనరుల జాబితాను గ్రామ ఎస్‌జిఎస్‌డబ్ల్యు కార్యాలయంలో ప్రదర్శించడం. హౌసింగ్ లేఅవుట్లలో ఖాళీ ప్లాట్ల ధృవీకరణ. "అందరికీ ఇళ్లు" పథకం కింద వచ్చిన దరఖాస్తుల పరిశీలన. ప్రభుత్వ భూముల తనిఖీ. గ్రామస్తుల నుండి వినతిపత్రాల స్వీకరణ. సులభమైన కేసులను అదే చోట పరిష్కరించి అంగీకార పత్రం ఇవ్వడం. అందుకున్న అన్ని వినతులను అదే రోజు పీజీఆర్ఎస్‌లో అప్‌లోడ్ చేయడం. ఆర్ఓఆర్ చట్టం, ఇతర చట్టాల ప్రకారం విచారణకు స్టాట్యూటరీ నోటీసులు జారీ చేయడం

రెండవ సందర్శన -- ధృవీకరణ అండ్ సమాచార పంపిణీ

వినతిదారులకు పురోగతి వివరాలు తెలియజేయడం. రికార్డులు, సర్వే వివరాల ఫీల్డ్ ధృవీకరణ. విచారణ (హియరింగ్) ప్రక్రియ నిర్వహణ. అదనపు వినతుల స్వీకరణ

మూడవ సందర్శన -- పరిష్కారం

పూర్వ వినతుల పరిష్కారం. చట్టబద్ధ కాలవ్యవధి అనంతరం ఉత్తర్వులు జారీ చేయడం. తీసుకున్న చర్యలను పారదర్శకంగా తెలియజేయడం మరియు మ్యూటేషన్లకు సంబంధించిన ఉత్తర్వులను వ-ఖ్‌జ ద్వారా అందజేయడం

నాలుగవ సందర్శన -- ముగింపు

గ్రామ సభ నిర్వహించి పరిష్కరించిన ఫిర్యాదులను సభ్యుల ముందు చదవడం. అన్ని ఫిర్యాదులు, వాటి పరిష్కార వివరాల పూర్తి జాబితాను ఎస్‌జీఎస్‌డబ్ల్యు కార్యాలయంలో ప్రజా సమాచారానికి ప్రదర్శించడం

కోర్టు సంబంధిత లేదా క్లిష్టమైన చట్టపరమైన అంశాలు తప్ప ఇతర ఏ ఫిర్యాదూ పెండింగ్‌లో ఉంచకూడదు. త్వరితగతిన పరిష్కారం కోసం ఆర్‌డీఓ/జేసీ కోర్టులకు ప్రత్యేకంగా నివేదించడం. ప్రభుత్వం పక్షంగా ఉన్న సివిల్ కేసులలో అవసరమైతే ూ-ూ/-ూఎ ద్వారా ప్రత్యేకంగా ప్రస్తావించడం. చేసి ఆ గ్రామాన్ని సమస్య లేనటువంటి గ్రామంగా తీర్చి చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశాలు జారీ చేసి ఉన్నారు కావున మన అన్నమయ్య జిల్లా రాయచోటి మండలంలో నేడు గురువారం కాటిమాయకుంట గ్రామంలో ప్రజా ఫిర్యాదుల వేగవంతమైన పరిష్కార కార్యక్రమం ఒక నెల ఒక గ్రామం నాలుగు సందర్శనము నిర్వహించబడును. ఈ ఒక్క విషయాన్ని గ్రహించి గ్రామస్తులందరూ విరివిడిగా పాల్గొని వారి సమస్యలు ఏమైనా ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరుతున్నామన్నారు.

ప్రమాదాలు జరగక ముందే జాగ్రత్తలు తీసుకోవాలి

- అగ్నిమాపక కేంద్ర అధికారి బి.హరిబాబు

వేంపల్లె – సూర్య వాస్తవం: అగ్ని ప్రమాదాలు జరగక ముందే జాగ్రత్తలు తీసుకుంటే ప్రాణపాయం నుండి బయట పడవచ్చు అని అగ్నిమాపక అధికారి బి. హరిబాబు పేర్కొన్నారు. శుక్రవారం మౌని బాబా ఫిల్లింగ్ స్టేషన్ నందు అగ్ని ప్రమాదాల పట్ల అవగాహన సదస్సును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అగ్ని ప్రమాదాల జరగక ముందే జాగ్రత్తలు తీసుకుంటే ప్రాణాపాయ ప్రమాదాల నుండి బయటపడవచ్చు అని తెలిపారు. మౌని బాబా ఫిల్లింగ్ స్టేషన్ నందు వాహనదారులకు మరియు అక్కడ పని చేయు సిబ్బందికి ఆ ప్రాంత ప్రజలకు అగ్ని ప్రమాదాలపై సిబ్బంది అవగాహన కల్పించారు అగ్ని ప్రమాదం జరిగితే ఎలా బయటపడాలని వాటిపై అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు సంభవించిన వెంటనే సమాచారం ఇవ్వాలని వేసవిలో అగ్ని ప్రమాదాలు ఎక్కువగా జరుగుతుంటాయని తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేయడం అయింది అన్నారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది మహమ్మద్ రఫీ,నవీన్ కుమార్రెడ్డి, సురేష్ రెడ్డి,సంజీవరెడ్డి, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారుపాల్గొన్నారు.

వివాహ వేడుకలకు హాజరైన ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్

ఉరవకొండ – సూర్య వాస్తవం : అనంతపురం నగరంలోని ఎం వై ఆర్ కళ్యాణ మండపంలో జరిగిన చోళసముద్రం మురళి కుమారుని వివాహ వేడుకకు ఆంధ్రప్రదేశ్ ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తో పాటు శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి ముఖ్య అతిథులుగా హాజరై, నూతన వధూవరులను ఆశీర్వదించారు.అక్కడి వచ్చిన అతిథులను టీడీపీ నాయకులను, కార్యకర్తలను ఆప్యాయంగా పలకరించారు అనంతరం అక్కడ నుండి బయలుదేరి ఉరవకొండలోని దేవాంగ కళ్యాణ మండపంలో జరిగిన అమిలినేని లక్ష్మీనారాయణ గారి కుమార్తె వివాహ వేడుకకు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి, వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమం లో టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.పయ్యావుల కేశవ్ అందరిని పలకరిస్తూ వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకొన్నారు. తర్వాత ఉరవకొండలోని నూతేటి వెంకటేశులు నూతన గృహప్రవేశ కార్యక్రమానికి మంత్రి పయ్యావుల కేశవ్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన నూతన గృహంలో అడుగుపెట్టిన కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఆ ఇంట్లో అందరూ సుఖ శాంతులతో, ఐశ్వర్యంతో వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు.



హిందీలో అవకాశాలు లేనివారే
సౌత్ వైపు వెళతారనే అభిప్రాయం అప్పట్లో ఉండేది: సమీరారెడ్డి

తనను దక్షిణాది సినిమాల్లోకి వెళ్లొద్దని హెచ్చరించారన్న సమీరారెడ్డి దక్షిణాది స్టార్లతో పనిచేయడం తన తండ్రికి గర్వకారణమని వెల్లడి ఇప్పుడు బాలీవుడ్ అగ్రతారలు సౌత్ సినిమాల కోసం పోటీ పడుతున్నారని వ్యాఖ్య దక్షిణాది సినిమాలపై తనకున్న గౌరవాన్ని సినీ నటి సమీరారెడ్డి మరోసారి చాటుకున్నారు. తన కెరీర్ ఆరంభంలో నాటి అనుభవాల గురించి ఓ ఇంటర్వ్యూలో ఆమె పంచుకున్నారు. సమీరారెడ్డి కెరీర్ మొదట్లో హిందీ సినిమాలతో బిజీగా ఉన్నప్పుడు, ఆమె టీమ్ సభ్యులు దక్షిణాది సినిమాల వైపు వెళ్లొద్దని హెచ్చరించారట.

"హిందీలో అవకాశాలు లేని వారే సౌత్ వైపు వెళతారు" అనే తప్పుడు అభిప్రాయం అప్పట్లో ఉండేదని ఆమె గుర్తు చేసుకున్నారు.

కానీ, ఒక సౌత్ ఇండియన్ అమ్మాయిగా తన మూలాలను గౌరవిస్తూ, ఆ మాటలను పక్కన పెట్టి జూనియర్ ఎన్టీఆర్ వంటి స్టార్ల సరసన నటించడానికి ఆమె సిద్ధపడ్డారు. చిరంజీవి, ఎన్టీఆర్, సూర్య, అజిత్ వంటి దిగ్గజాలతో పనిచేయడం తన కుటుంబానికి, ముఖ్యంగా తన తండ్రికి గర్వకారణమని ఆమె సగర్వంగా చెప్పుకొచ్చారు. ప్రస్తుతం బాలీవుడ్ అగ్ర హీరోయిన్లు సౌత్ సినిమాల కోసం పోటీ పడుతున్న విషయాన్ని సమీరా గుర్తు చేశారు.

దక్షిణాది దర్శకులు కొత్త ప్రయోగాలు చేయడానికి, రిస్క్ తీసుకోవడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉంటారని, అందుకే ఇక్కడి సినిమాలు సాంకేతికంగా, యాక్షన్ పరంగా ఎప్పుడూ ముందంజలో ఉంటాయని ఆమె విశ్లేషించారు. హిందీ మేకర్స్ తరచుగా 'సేఫ్ జోన్'లో ఉండాలని చూస్తారని ఆమె అభిప్రాయపడ్డారు. దాదాపు దశాబ్ద కాలం పాటు వెండితెరకు దూరంగా ఉన్న సమీరా, ఇప్పుడు సంజయ్ దత్ సరసన 'ఆఖరి సవాల్' చిత్రంతో మళ్లీ ప్రేక్షకులను పలకరించబోతున్నారు.

ఇది తన కమ్ బ్యాక్ కాదని, కేవలం ఒక చిన్న విరామం తర్వాత చేస్తున్న ప్రయాణమని ఆమె స్పష్టం చేశారు.

ధురంధర్-2 ఓటీటీలోకి వస్తోంది..
అయితే భారత్ లో కాదు!

రణవీర్ సింగ్ 'ధురంధర్ 2' ఓటీటీ రిలీజ్ తేదీ ఖరారు
మే 14 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో అంతర్జాతీయ స్ట్రీమింగ్
భారత్‌లో జియోహాట్‌స్టార్‌లో విడుదల కావొచ్చని ప్రచారం
ప్రపంచవ్యాప్తంగా రూ.1,790 కోట్లకు పైగా వసూళ్లు సాధించిన చిత్రం
దాదాపు 4 గంటల నిడివితో 'రా అండ్ అన్ దేఖా' వర్షన్‌గా విడుదల

బాలీవుడ్ స్టార్ హీరో రణవీర్ సింగ్ నటించిన స్పై థ్రిల్లర్ 'ధురంధర్ 2: ది రివెంజ్' ఓటీటీ విడుదల తేదీ ఖరారైంది. థియేటర్లలో రికార్డు స్థాయి వసూళ్లు సాధించిన ఈ చిత్రం, మే 14 నుంచి అంతర్జాతీయంగా నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది. అయితే, భారత్‌లో మాత్రం ఈ సినిమా నెట్‌ఫ్లిక్స్‌లో అందుబాటులో ఉండదు. దీంతో భారత ప్రేక్షకులు ఎక్కడ చూడాలనే దానిపై ఆసక్తి నెలకొంది.

ఆదిత్య ధర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం మార్చి 19న థియేటర్లలో విడుదలై బాక్సాఫీస్ వద్ద ప్రభంజనం సృష్టించింది. తాజాగా నెట్‌ఫ్లిక్స్ అధికారికంగా విడుదల తేదీని ప్రకటించింది. ఈ సినిమా 'రా అండ్ అన్ దేఖా' (ౄుఽ ఽ ఖఅఽవఽఽఽ్ఱు) అనే ట్యాగ్‌లైన్‌తో, దాదాపు 3 గంటల 52 నిమిషాల సుదీర్ఘ రన్‌టైమ్‌తో రానుంది. సెన్సార్ చేయని సన్నివేశాలు, అదనపు ఫుటేజ్‌తో ఈ ప్రత్యేక వర్షన్‌ను విడుదల చేయనున్నారు.

భారత్‌లో ఈ చిత్రాన్ని జియోహాట్‌స్టార్ ప్లాట్‌ఫామ్‌పై మే 14నే విడుదల చేయవచ్చని కొన్ని కథనాలు సూచిస్తున్నాయి. అయితే, దీనిపై నిర్మాతల నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. సినిమాలోని ఒక పాట రీమిక్స్‌పై కోర్టులో కేసు నడుస్తున్న నేపథ్యంలో, థియేట్రికల్ రిలీజ్ తర్వాత 8 వారాల గ్యాప్ ఇచ్చాకే ఓటీటీలోకి వస్తుందని నిర్మాతలు గతంలో తెలిపారు. మే 14 నాటికి సినిమా విడుదలై సరిగ్గా 8 వారాలు పూర్తవుతుంది.

ఈ చిత్రంలో రణవీర్ సింగ్‌తో పాటు సారా అర్జున్, అర్జున్ రాంపాల్, ఆర్. మాధవన్, సంజయ్ దత్ కీలక పాత్రలు పోషించారు. ఇప్పటివరకు ఈ సినిమా భారత్‌లో రూ. 1,140 కోట్ల నెట్ కలెక్షన్లు సాధించగా, ప్రపంచవ్యాప్తంగా రూ. 1,791 కోట్ల గ్రాస్ వసూళ్లు రాబట్టింది. అంతర్జాతీయంగా విడుదల తేదీ ఖరారైనప్పటికీ, భారత్‌లోని ఓటీటీ రిలీజ్‌పై అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు.

ఫిన్ అలెన్ ఊచకోత...
ఢిల్లీ క్యాపిటల్స్ పై కేకేఆర్ అలవోక విజయం

ఢిల్లీ క్యాపిటల్స్‌పై కోల్‌కతా నైట్ రైడర్స్ ఘన విజయం
మెరుపు సెంచరీతో చెలరేగిన ఓపెనర్ ఫిన్ అలెన్
కేవలం 47 బంతుల్లోనే 100 పరుగులు చేసిన అలెన్
వరుసగా నాలుగో విజయంతో కేకేఆర్ జైత్రయాత్ర
అలెన్‌కు అండగా నిలిచిన కామెరాన్ గ్రీన్

ఐపీఎల్ 2026లో కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) జైత్రయాత్ర కొనసాగుతోంది. ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో, ఓపెనర్ ఫిన్ అలెన్ (100 నాటౌట్) అజేయ సెంచరీ సాధించడంతో, ఢిల్లీ క్యాపిటల్స్‌ను 8 వికెట్ల తేడాతో కేకేఆర్ చిత్తు చేసింది. ఈ సీజన్‌లో కోల్‌కతాకు ఇది వరుసగా నాలుగో గెలుపు కావడం విశేషం.

143 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన కేకేఆర్.. అలెన్ విధ్వంసంతో మరో 34 బంతులు మిగిలి ఉండగానే, కేవలం 14.2 ఓవర్లలోనే విజయాన్ని అందుకుంది. కేవలం 47 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేసిన అలెన్ తన ఇన్నింగ్స్‌లో 5 ఫోర్లు, 10 భారీ సిక్సర్లు బాదాడు. అతనికి కామెరాన్ గ్రీన్ (33 నాటౌట్) చక్కటి సహకారం అందించాడు. వీరిద్దరూ కలిసి అజేయంగా 116 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు.

ఛేదన ఆరంభంలో కేకేఆర్ కెప్టెన్ అజింక్యా రహానే, అంగ్‌క్రిష్ రఘువంశీ వికెట్లను త్వరగానే కోల్పోయింది. అయితే, క్రీజులోకి వచ్చిన గ్రీన్‌తో కలిసి అలెన్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. ఢిల్లీ బౌలర్లపై పూర్తి ఆధిపత్యం ప్రదర్శిస్తూ, ముఖ్యంగా స్పిన్నర్లను లక్ష్యంగా చేసుకుని భారీ షాట్లతో విరుచుకుపడ్డాడు. విప్రాజ్ నిగమ్ వేసిన ఒకే ఓవర్‌లో మూడు సిక్సర్లు బాది మ్యాచ్ స్వరూపాన్నే మార్చేశాడు. చివరగా, ముఖేష్ కుమార్ బౌలింగ్‌లో మిడ్ వికెట్ మీదుగా సిక్సర్ బాది తన సెంచరీని, జట్టు విజయాన్ని ఘనంగా పూర్తి చేశాడు.

అంతకుముందు, కేకేఆర్ బౌలర్ల కట్టుదిట్టమైన బౌలింగ్‌కు ఢిల్లీ క్యాపిటల్స్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 142 పరుగులు మాత్రమే చేయగలిగింది.

సంక్షిప్త స్కోర్లు:

ఢిల్లీ క్యాపిటల్స్: 142/8 (20 ఓవర్లు) (పాతుమ్ నిస్సంక 50, అశుతోష్ శర్మ 39; కార్తీక్ త్యాగి 2-25, అనుకుల్ రాయ్ 2-31)

కోల్‌కతా నైట్ రైడర్స్: 147/2 (14.2 ఓవర్లు) (ఫిన్ అలెన్ 100 నాటౌట్, కామెరాన్ గ్రీన్ 33 నాటౌట్; అక్షర్ పటేల్ 1-27)

ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్ స్లామ్ టోర్నీని బహిష్కరిస్తాం
ప్రైజ్ మనీ పెంపుకు ఆటగాళ్లు పట్టు

పారిస్: ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్ స్లామ్ టోర్నీలో ఆడే ఆటగాళ్లకు అందజేసే ప్రైజ్ మనీ పెంపుకు ఆటగాళ్లు మరింత డిమాండ్ చేస్తున్నారు. తాజాగా గ్రాండ్ స్లామ్ టోర్నీ నిర్వాహకులు ప్రైజ్ మనీ పెంపుపై ఎలాంటి విషయం తేల్చకపోవడంతో టోర్నీని బహిష్కరిస్తామని శుక్రవారం ప్రకటించారు. తమకు గౌరవం లభించని టోర్నీలో ఆడేది లేదని, ప్రైజ్ మనీని పెంపుదల చేయకపోతే గ్రాండ్ స్లామ్ టోర్నీని బహిష్కరిస్తామని టాప్ సీడ్, ప్రపంచ నంబర్ ఆటగాడు జెన్నిక్ సిన్నర్ తెలిపాడు.

గత ఏడాది మహిళల సింగిల్స్ టైటిల్ నెగ్గిన కోకో గాఫ్ తో పాటు, అర్యానా సబలెంకా కూడా ఆటగాళ్లకు ముట్టజెప్పే ప్రైజ్ మనీని పెంపుదల చేయడాలని గ్రాండ్ స్లామ్ టోర్నీ నిర్వాహకులు లేఖలు రాశారు. నిర్వాహకులకు దక్కే వాటాలో 15శాతం పెంపుదలకు యాజమాన్యం అంగీకరించినా.. అది ఏమాత్రం సరిపోదని, దానిని 22 శాతానికి పెంచాలని ఆటగాళ్లు ప్రధానంగా డిమాండ్ చేస్తున్నారు. ఆటగాళ్లకు అందజేసే వాటాను ఇప్పటివరకు 9.5 ఉండడంతోఆటగాళ్లకు, నిర్వాహకులకు మధ్య వివాదం ముదిరిన సంగతి తెలిసిందే. 2024లో ఆటగాళ్లకు 15.5శాతం వాటా పంపకం జరగ్గా.. అది 2026 నాటికి 14.9శాతానికి తగ్గినట్లు ఆటగాళ్లు ప్రధానంగా డిమాండ్ చేస్తున్నారు.

వైభవంగా నంబూరి రిషిత, హేమంత్ వివాహ వేడుక

ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఆర్. కే మిత్ర బృందం

అనంతపురం - సూర్య వాస్తవం : అనంతపురం పట్టణంలోని స్థానిక కమ్మ భవన్ ఫంక్షన్ హాల్లో శుక్రవారం నాడు జరిగిన నంబూరి రిషిత, హేమంత్ వివాహ వేడుక వైభవంగా నిర్వహించబడింది. ఈ శుభకార్యానికి టీడీపీ నాయకులు రామకృష్ణ మిత్రులు ప్రసాద్, నరసప్ప, శీన, శేఖర్, భాస్కర్, జయకుమార్, శ్రీ రామ్, సులేమాన్, ఫణి, నాగయ్య, హజరత్, అస్లాం తదితరులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రిషిత, హేమంత్ వివాహ రిసెప్షన్ వేడుక కార్యక్రమం ఇరు కుటుంబాల పెద్దలు, బంధుమిత్రుల సమక్షంలో శాస్త్రోక్తంగా జరిగింది. ఈ సందర్భంగా ఆర్. కే మిత్రులు నూతన వధూవరులను ప్రత్యేకంగా అభినందించి, వారికి శుభాకాంక్షలు తెలిపారు. వివాహ బంధంతో ఒక్కటి కాబోతున్న ఈ జంట జీవితాంతం సుఖసంతోషాలతో, అన్యోన్యంగా ఉండాలని వారు ఆకాంక్షించారు.

ఘనంగా నంబూరి హరినాథ్ చౌదరి,

రాధా కుమార్తె వివాహ వేడుక...!

- ముఖ్య అతిథులుగా హాజరైన ఏపీజేఏసి అమరావతి చైర్మన్ దివాకర్ బాబు, తలారి పెద్దయ్య

అనంతపురం - సూర్య వాస్తవం :

వాప్తాడు మండలం టిడిపి నాయకులు సోమరా రామకృష్ణ (ఆర్. కే) సోదరి నంబూరి రాధా, నంబూరి హరినాథ్ చౌదరి కుమార్తె రిషిత, హేమంత్ వివాహ వేడుక అనంతపురం పట్టణంలోని స్థానిక కమ్మ భవన్ ఫంక్షన్ హాల్లో శుక్రవారం నాడు కుటుంబ సభ్యుల మధ్య ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ దివాకర్ రావు, రాష్ట్ర పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఈసీ మెంబర్ తలారి పెద్దయ్య హాజరయ్యారు. వధూవరులకు పుష్పగుచ్ఛం అందించి వారు ఆశీర్వదించారు.



నేడు విద్యుత్ అంతరాయం

నాయుడుపేట- సూర్య వాస్తవం : తిరుపతి జిల్లా నాయుడుపేట పట్టణంతో పాటు మండలంలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని విద్యుత్ శాఖ అధికారులు వెల్లడించారు. 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మత్తుల పనులు చేపట్టనున్న నేపథ్యంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈలు ఎన్. శివశంకర్, సి.హెచ్. హరికృష్ణ సంయుక్త ప్రకటనలో తెలిపారు. నాయుడుపేట పట్టణ పరిధిలోని లోతువానిగుంట, ఎల్ఐసాగరం, బీడీ కాలనీ, భూపయ్య కాలనీ, అగ్రహారపేట, పిచ్చిరెడ్డి తోపు, అమరా గార్డెన్, చంద్రమౌళి నగర్, విజయ గణపతి టెంపుల్ ప్రాంతం, టీచర్స్ కాలనీ, బాలాజీ గార్డెన్, బాలాజీ గ్రీన్ సిటీ, గాంధీ మందిరం, జైహింద్ కాలనీ, గరిడి వీధి, కోళ్ల ఫారం, ఆవని హోమ్స్, కాళహస్తి బైపాస్ రోడ్, హెచ్‌పి పెట్రోల్ బంక్, రాజగోపాలపురం, శ్రీరామ్ నగర్, అశోక్ నగర్, విన్నమాల గేట్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. అలాగే నాయుడుపేట మండలంలోని కోనేటి రాజుపాలెంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయ నున్నట్లు తెలిపారు. ప్రజలు, విద్యుత్ వినియోగదారులు శాఖ సిబ్బందికి సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

పుత్తూరు- సూర్య వాస్తవం: పుత్తూరు మండలం నేషనూర్ అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం కిషోరి వికాసం కార్యక్రమం పై బాలికలకు అవగాహన కల్పించారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ డి శ్రీదేవి, మండల హెల్త్ ఆఫీసర్ మార్టిన్, కీర్తి, టాటా ట్రస్ట్ బి సంతోష్ కిషోరి బాలికలకు పోషణ, ఆరోగ్యం, విద్యపై అవగాహన లైంగిక నేరాల నుండి పిల్లల రక్షణ చట్టం, బాల్య వివాహాల నిరోధం బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలు, రక్తహీనత,పరిశుభ్రత మరియు జీవన నైపుణ్యాల వంటి వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. పిల్లలు స్క్రీనింగ్ దూరంగా ఉంటూ ఇండోర్ ఔట్డోర్ ఆటలు పై శ్రద్ధ పెట్టి శారీరకంగానూ మానసికంగానూ సమస్యలు లేకుండా చేసుకోవడానికి ఉత్సాహం కలుగుతుంది అని తెలియజేశారు. మన లక్ష్యం మనం చేరుకోవడానికి సరైన వయసు కనుక మంచి ఆలోచనలతో ముందుకు అడుగు వేద్దాం మనకి జన్మనిచ్చిన తల్లిదండ్రులకు మనం భరోసాగా ఉండాలని తెలియజేశారు. ఇందులో నేషనూర్ గ్రామ ప్రజలు, అంగన్వాడీ టీచర్ ధనమ్మ సుమతి ఆశా వర్కర్ పాల్గొన్నారు.

కనేకల్‌లో కరెంటు కోతలపై ప్రజల ఆగ్రహం

- విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద ఆందోళన
- "బిల్లులు కట్టకపోతే ఫైన్..
కరెంట్ లేకపోతే బాధ్యత ఎవరిది?" అంటూ నిలదీత

కనేకల్- సూర్య వాస్తవం: కనేకల్ పట్టణంలో తరచూ జరుగుతున్న విద్యుత్ కోతలపై ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గురువారం రాత్రి బస్టాండ్ ప్రాంతంలో ఆకస్మికంగా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గంటల పాటు కరెంట్ రాకపోవడంతో ఆగ్రహించిన ప్రజలు విద్యుత్ శాఖ కార్యాలయానికి చేరుకుని అధికారులను నిలదీశారు. ఎండాకాలంలో ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరుగుతున్న వేళ విద్యుత్ కోతలు ప్రజలను మరింత ఇబ్బందులకు గురిచేస్తున్నాయని స్థానికులు వాపోయారు. చిన్నపిల్లలు, వృద్ధులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారు రాత్రంతా నిద్రపోలేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. విద్యుత్ అంతరాయాల వల్ల విద్యార్థులు చదువులకు ఆటంకం కలుగుతోందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. "ఒక్కరోజు కరెంట్ బిల్లు ఆలస్యమైతే వెంటనే ఫైన్ వేస్తారు. కానీ గంటల తరబడి విద్యుత్ నిలిపివేస్తే ప్రజల ఇబ్బందులను ఎవరు పట్టించుకుంటారు?" అంటూ స్థానికులు ప్రశ్నించారు. ముందస్తు సమాచారం లేకుండానే తరచూ కరెంటు నిలిపివేయడం వల్ల ప్రజలు తీవ్ర అసహనానికి గురవుతున్నారని పేర్కొన్నారు. బస్టాండ్ ప్రాంతంలో చిన్నచిన్న వ్యాపారాలు నిర్వహించే వ్యాపారులు కూడా విద్యుత్ కోతలతో నష్టపోతున్నామని తెలిపారు. ఫ్యాన్లు, ఫ్రిజ్‌లు, కూలర్లు పనిచేయక పోవడంతో వేసవి వేడిని తట్టుకోవడం కష్టంగా మారిందని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు.అధికారులు మాత్రం సమస్యపై సరైన స్పందన ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపించారు.కనేకల్ పట్టణంలో విద్యుత్ సరఫరాను మెరుగుపరచి, తరచూ జరుగుతున్న కరెంటు కోతలకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

నూతన గృహ ప్రవేశానికి హాజరైన జనసేన ఇంచార్జి గౌతమ్ కుమార్

ఉరవకొండ - సూర్య వాస్తవం : తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు నూతేటి వెంకటేశులు ఆహ్వానం మేరకు, నూతన గృహప్రవేశ కార్యక్రమానికి జనసేన పార్టీ నియోజకవర్గ ఇంచార్జి గౌతమ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గౌతమ్ కుమార్ వెంకటేశులు కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం బెళుగుప్ప జనసేన మండల అధ్యక్షులు సుధీర్ కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసాడు. ఈ కార్యక్రమంలో పలువురు జనసేన పార్టీ నాయకులు కూడా పాల్గొన్నారు: వజ్రకరూరు మండల అధ్యక్షులు, కేశవ్, హరి శంకర్, సూర్య నాయక్ , మణి కుమార్

తప్పులు లేని రెవెన్యూ రికార్డులు తయారు చేయండి

- ఆర్డీవో వివిఎస్ శర్మ



నంబుల పూలకుంట - సూర్య వాస్తవం : రిసర్వే లో భాగంగా రెవెన్యూ డివిజనల్ అధికారి వివిఎస్ శర్మ మర్రికొమ్మదిన్నె గ్రామంలో జరుగుతున్న గ్రౌండ్ ట్రూతింగ్ ప్రక్రియను పరిశీలించి, క్షేత్రస్థాయి సిబ్బంది మరియు రైతులతో మాట్లాడి పనుల పురోగతిని తెలుసుకున్నారు. అలాగే గౌకనపల్లి గ్రామంలో జరుగుతున్న రిసర్వే - వెక్టరైజేషన్ పనులను పరిశీలించి ధృవీకరించారు. పనులను నిర్దిష్ట గడువులో ఖచ్చితత్వంతో పారదర్శకంగా పూర్తి చేయాలని మరియు తప్పులు లేని రెవెన్యూ రికార్డుల తయారు చేయాలని సంబంధిత సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు దేవేంద్ర నాయక్, మండల సర్వేయర్ రేరాజు శిరోధర, గ్రామ సర్వేయర్ ఉపేంద్ర, హర్షవర్ధన్ ,గ్రామ రెవెన్యూ అధికారి వెంకటనారాయణ , పాల్గొన్నారు.

బోలా వారి వివాహ మహోత్సవంలో పాల్గొన్న మఠాధిపతులు రాజకీయ నాయకులు

బ్రహ్మంగారిమఠం - సూర్య వాస్తవం : ఉయ్యాలవాడ జంబల్దిన్నె గ్రామంలో బ్రహ్మంగారి మఠం తెలుగుదేశం నాయకుడు బోలా శ్రీనివాసులు వారి కుమార్తె వివాహ మహోత్సవానికి శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి మఠం మఠాధిపతి శ్రీ వీర ధర్మజ వెంకటాద్రి స్వాముల వారు పాల్గొని వధువు వరుడు లను ఆశీర్వదించారు. ఆయన వెంట మఠాధిపతి సోదరుడు శ్రీ దత్తాత్రేయ స్వామి, కాబోయే మేనేజర్ పిపిఎన్ ప్రసాద్ ఉన్నారు. శ్రీ ఈశ్వరీ దేవి మఠం మఠాధిపతి శ్రీ వీర శివకుమార స్వాములవారు పాల్గొని పెళ్లి కుమార్తె పెళ్లి కుమారుడిని ఆశీర్వ దించారు. అలాగే మండల ఎంపీపీ వీరనారాయణరెడ్డి, తెలుగుదేశం మండలాధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, తెలుగుదేశం మండల నాయకులు పోలిరెడ్డి ,ఎస్ఆర్ శ్రీనివాసులు రెడ్డి, పూజ శివయ్య యాదవ్ ,విలేకరుల సంఘం మండల అధ్యక్షుడు ఎల్. సుధాకర్ రెడ్డి బంధువులు మిత్రులు, స్నేహితులు పాల్గొని ఆశీర్వదించారు.

కోడి పందాలపై పోలీసుల దాడి

- జూదంపై ఉక్కుపాదం : ఎస్ ఐ ఆదిలక్ష్మి
- ముగ్గురు అదుపులోకి.. నగదు, బైకులు, కోళ్లు స్వాధీనం
- అనకవోలు శివారులో కోడి పందాలపై పోలీసుల దాడి

పెళ్లకూరు- సూర్య వాస్తవం: పెళ్లకూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని అనకవోలు గ్రామ శివారు ప్రాంతంలో నిర్వహిస్తున్న కోడి పందాలపై పోలీసులు ఆకస్మికంగా ఎస్ ఐ ఆదిలక్ష్మి దాడి నిర్వహించారు. ముందస్తు సమాచారం అందడంతో ప్రత్యేక బృందం అక్కడికి చేరుకుని రైడ్ చేపట్టింది. ఈ సందర్భంగా కోడి పందాలు నిర్వహిస్తూ జూదంలో పాల్గొంటున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి రూ.1300 నగదు, మూడు బైకులు, మూడు సెల్ ఫోన్లు, మూడు కోడి పందాల కోళ్లను స్వాధీనం ఎస్ ఐ ఆదిలక్ష్మి చేసుకున్నారు. కోడి పందాలు, జూద కార్యకలాపాలు చట్ట విరుద్ధమని, ఇటువంటి అక్రమాలపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. అదుపులోకి తీసుకున్న వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS ADDRESS : # DOOR NO-4-29-A-19-12-, DONTHI STREET, MADANAPALLI, ANNAMAYYA, CHITTOOR, ANDHRA PRADESH - 517325. CELL : 9948461699 (ASSOCIATE EDITOR -Mohammad Shafi Ahamad)